ప్రజా కలం

epaper.prajakalam.in
www.prajakalam.in

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily — తెలుగు దినపత్రిక

మంగళవారం | 13-07- 2026 | సంపుటి: 17, సంచిక: 101, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



ప్రజా కలం Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526


### రాజకీయాలకు అతీతంగా

# రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం**




- పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో అన్ని పార్టీల ఎంపీలతో సీఎం రేవంత్ రెడ్డి కీలక సమావేశం
- నీటిపారుదల, మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి
- హైదరాబాద్‌కు ఐఐఎం, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు అంశాలపై ఎంపీలకు దిశానిర్దేశం

హైదరాబాద్, జూలై 13 (ప్రజాకలం) : తెలంగాణ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల పార్లమెంట్ సభ్యులు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని రాష్ట్ర ప్రయోజనాలను సాధించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న తెలంగాణకు సంబంధించిన కీలక అంశాలపై ఎంపీలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంపీలకు సమగ్ర వివరాలు అందించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రఘురాం రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశ జీడీపీలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందని, దేశంలోని ఆరు ప్రధాన మహానగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. ఇలాంటి నగరానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటు అత్యవసరమని,

తరువాయి 2వ పేజీలో...



# సింగరేణి కష్టాలకు

# బీఆర్ఎస్, కాంగ్రెస్సే కారణం

**తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ తో సింగరేణికి మనుగడ**

**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: జూలై 13: (ప్రజా కలం న్యూస్) సిరుల గని సింగరేణిని గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కష్టాలు పాలు చేసిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమంలో భాగంగా బిజెపి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కొత్తగూడెం క్లబ్లో ఏర్పాటు చేసిన సభకి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒకప్పుడు సింగరేణిలో ఎక్కువ సంఖ్యలో ఉన్న కార్మికులు క్రమక్రమంగా తగ్గిపోతున్నారని అంతేకాకుండా బొగ్గు ఉత్పత్తి సైతం క్రమంగా తగ్గుతుందని దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వాలేనని విమర్శించారు. ముఖ్యంగా గత కెసిఆర్ ప్రభుత్వం సింగరేణి సొమ్మును భారీగా దోచుకుందని మండిపడ్డారు. సింగరేణిని అభివృద్ధిలోకి నడిపించాల్సిన కేసీఆర్ భ్రష్టు పట్టించే విధంగా వ్యవహరించడం జరిగిందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని అసహనం వ్యక్తం చేశారు. గత కాంగ్రెస్ హయాంలోని ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ ఉన్న సమయంలో పెద్ద ఎత్తున బొగ్గు కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కష్టాల్లో ఉన్న సింగరేణిని గట్టెక్కించేందుకు

తరువాయి 2వ పేజీలో...

# ఉద్యమకారుల గుర్తింపులో మరో కీలక అంకం

## రంగారెడ్డి, మహబూబ్ నగర్, హైదరాబాద్ జిల్లాల ముఖాముఖిలో చారిత్రాత్మక డిమాండ్లపై కమిటీ సానుకూల స్పందన

హైదరాబాద్, జూలై 13 (ప్రజాకలం) : ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ఏర్పాటైన ఉన్నత స్థాయి "తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ" అధికారిక షెడ్యూల్ ప్రకారం నేడు (జూలై 13న) అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) లో రంగారెడ్డి, మహబూబ్ నగర్, మరియు హైదరాబాద్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకా రులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించింది.
ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, సభ్యులు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, ప్రభుత్వ విప్ శ్రీ అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు శ్రీ మోతె శోభన్ రెడ్డి, శ్రీ ఎస్. రాములు నాయక్ తదితరులు హాజరై, మూడు జిల్లాల నుండి తరలివచ్చిన పోరాటయోధుల సలహాలను మరియు సూచనలను స్వీకరించారు.
ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, స్వరాష్ట్ర సాధనలో ఈ మూడు జిల్లాల ఉద్యమకారులు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని కొనియాడారు. రాజధాని నగరంతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో జరిగిన చారిత్రాత్మక



ఆందోళనలు, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ విజయవంతం కావడానికి ఇక్కడి క్షేత్రస్థాయి శ్రేణులే వెన్నుముకగా నిలిచారని ప్యానల్ స్పష్టం చేసింది.
సమావేశంలో ప్రతిపాదించిన చారిత్రాత్మక డిమాండ్లు – విధివిధానాలు:
నేటి ముఖాముఖి సంప్రదింపుల్లో జిల్లాల ప్రతినిధులు, ఉద్యమకారులు తమ ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును రక్షించాలని కోరుతూ కమిటీ ముందు ఈ క్రింది ప్రధాన సంక్షేమ డిమాండ్లను ఉంచారు. వీటిపై కమిటీ సానుకూలంగా స్పందిస్తూ సమగ్ర నివేదికలో చేర్చుతామని హామీ ఇచ్చింది:
ఉద్యమకారుల సంక్షేమ కమిషన్‌కు చట్టబద్ధత : భవిష్యత్తులో ప్రభుత్వాలు మారినా ఉద్యమకారుల హక్కులకు శాశ్వత రక్షణ ఉండేలా, ఈ కమిషన్‌ను ఒక చట్టబద్ధమైన సంస్థగా మారుస్తూ చట్టం తీసుకురావాలి.
తదుపరి తరానికి విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు : నాటి పోరాటంలో సర్వస్వం కోల్పోయిన ఉద్యమకారుల పిల్లలకు ప్రభుత్వ విద్యాసంస్థల అడ్మిషన్లలో మరియు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక రిజర్వేషన్ కోటా కల్పించాలి.
మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక ప్రయోజనాలు : స్వరాష్ట్ర సాధనలో పురుషులతో సమానంగా లాఠీ దెబ్బలు తిని, జైలుకు వెళ్లిన మహిళా పోరాట యోధులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యతతో పాటు ప్రత్యేక సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.
ఉచిత రవాణా సౌకర్యం : వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమకారులందరికీ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులలో జీవితకాల ఉచిత ప్రయాణ రవాణా పాస్ సౌకర్యం కల్పించాలి.

తరువాయి 2వ పేజీలో...

### ఎల్-నినో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు

# ప్రభుత్వం సర్వసన్నద్ధం

**ఎల్-నినో పరిస్థితులతో రైతు నష్టపోకుండా మూడు దశల ముందస్తు కార్యాచరణలో మొదటి దశ కార్యచరణ అమలుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశం**

**ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి తుమ్మల**

**కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి**

**'రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినోపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తాం**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు**



హైదరాబాద్, జూలై 13: వానాకాలం-2026లో ఎల్-నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ లో భారత వాతావరణ శాఖ , ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్, సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను ఈ సమావేశంలో సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తుది కార్యాచరణపై మంత్రి చర్చించారు. ముందుగా వివిధ ఇన్స్టిట్యూషన్స్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎల్-నినో పరిస్థితులను తట్టుకునేవిధంగా వారు వారు సిద్ధం చేసిన కార్యచరణను మంత్రికి తెలియచేశారు. ముఖ్యంగా కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్



### 96,81,855 మంది చిన్నారులకు

## ఆల్బెండజోల్ ట్యాబ్లెట్ల పంపిణీ ప్రారంభం

**రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా**



2

### సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా

# ప్రభుత్వ పాలన

**రహదారుల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధుల మంజూరు**

**గద్వాల జిల్లాలో రూ. 339.39 కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణ శంకుస్థాపన చేసిన మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు**

ప్రజా కలం జూలై 13 (గద్వాల ప్రతినిధి) సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం ప్రజా రంజక పాలన అందిస్తోందని రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.
సోమవారం ధరూర్ మండల కేంద్రంలో జోగులాంబ జిల్లా వ్యాప్తంగా వివిధ రహదారుల విస్తరణ, మరమ్మత్తుల నిర్మాణానికి రూ. 339.39 కోట్ల నిధులతో చేపట్టిన హామ్ రోడ్ల పనులకు మంత్రి ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం సమీపంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదట మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కొత్త రేషన్ కార్డులు



ఇవ్వడమే కాక 3.18 కోట్ల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నమన్నారు. గృహ జ్యోతి పథకంతో నెలకు అర్హులైన ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ను అందించడం జరుగుతోందన్నారు.

తరువాయి 2వ పేజీలో...



### సింగరేణి అధికారుల సమస్యలపై

## సత్వరమే సానుకూల నిర్ణయం తీసుకోండి

**సింగరేణి యాజమాన్యానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు**

సింగరేణి భవన్, జులై 13 (ప్రజాకలం) : సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. కోల్ ఇండియా సంస్థల మాదిరిగా సింగరేణి అధికారుల వేతన సవరణ, పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ అమలుకు సంబంధించి అధికార సంఘం నాయకులు చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో తాడిచర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడంలో

తరువాయి 2వ పేజీలో...

# రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి

మొదటి పేజీ తరువాయి...

దీనికి కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి అవసరమని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ఐఐఎం మంజూరుకు ఎంపీలు విజ్ఞప్తి చేయాలని కోరారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 స్వాధీనం, మెట్రో ఫేజ్-2 విస్తరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో జరుగుతున్న చర్చల పురోగతిని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎస్‌బీఐ క్యాప్స్‌ను కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్రం అంగీకరించిందని, తదుపరి ప్రక్రియ వేగవంతం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఈ అంశంపై బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేకంగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగంలో 95 శాతం భూసేకరణ పూర్తయిందని, పనులు ప్రారంభించేందుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం అవసరమని తెలిపారు. అలాగే దక్షిణ భాగం భూసేకరణకు కూడా కేంద్రం నుంచి త్వరితగతిన అనుమతులు వచ్చేలా ఎంపీలు కృషి చేయాలని కోరారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు తొలి దశ టెండర్ల దశకు చేరుకుందని, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ఆమోదం కోసం కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలని సూచించారు. అంతర్రాష్ట్ర జల వివాదాల అంశాన్ని ప్రస్తావిస్తూ తుంగభద్ర జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా పూడిక కారణంగా తగ్గిపోయిందని, డ్యామ్‌తో పాటు కాలువల్లో పూడిక తొలగింపునకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు సహకరించేలా కేంద్ర జలశక్తి శాఖ జోక్యం చేసుకోవాలని పేర్కొన్నారు. గోదావరి-నాగార్జునసాగర్ అనుసంధానం, గోదావరి-కావేరి నదుల అనుసంధానం, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు అదనపు జలాల కేటాయింపు వంటి అంశాల్లో కూడా ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన పలు సాగునీటి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరభ్యంతర పత్రాలు ఇవ్వాల్సి ఉందని, ఆ ప్రక్రియ పూర్తయితే ప్రాజెక్టుల అమలుకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని తెలిపారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు విషయంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో కలిసి చర్చించాలని ఎంపీలకు సూచించారు.

రవాణా రంగంలోనూ రాష్ట్రానికి కీలకమైన ప్రాజెక్టులను సీఎం ప్రస్తావించారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి బెంగళూరు, చెన్నై, ముంబయికి బుల్లెట్ రైలు మార్గాల ఎలైన్‌మెంట్లు సిద్ధమయ్యాయని, ఆదిలాబాద్ డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ ఎయిర్‌పోర్టులకు భూసేకరణ పూర్తయిందని తెలిపారు. ఈ విమానాశ్రయాల్లో మెయింటెనెన్స్, రిపేర్స్ అండ్ ఓవర్‌హాలింగ్ (ఎంఆర్‌వో) కేంద్రాలు, ఎయిర్ కార్గో సౌకర్యాల ఏర్పాటుకు కేంద్ర సహకారం అందేలా ఎంపీలు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సహకార ధోరణిలోనే ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీలకు అవసరమైన సమాచారం, సమన్వయం కోసం ఐఏఎస్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌ను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. అన్ని పార్టీల ఎంపీలు సమిష్టిగా పనిచేస్తే తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీలు కూడా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

# సింగరేణి కష్టాలకు బీఆర్ఎస్, కాంగ్రెస్సే కారణం

మొదటి పేజీ తరువాయి...

నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం లేకుండా తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ ను సింగరేణికి కేటాయించడం జరిగిందన్నారు. ఈ బొగ్గు బ్లాక్ ద్వారా దాదాపు 50 ఏళ్ల పాటు నాణ్యమైన బొగ్గు దొరుకుతోందని తెలిపారు. దీంతో సింగరేణికి భారీఆదాయం సమకూరుతుందన్నారు.

సింగరేణికి అండగా బిజెపి...

ఎంతోమంది కార్మికులకు ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీకి బిజెపి ప్రభుత్వం అండగా నిలుస్తుందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు అన్నారు. గత కెసిఆర్ ప్రభుత్వం సింగరేణిని ఏటీఎంగా వాడుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల కష్టంతో సింగరేణికి వచ్చిన సొమ్మును ఇతర పనులకు వినియోగించడం జరిగిందన్నారు. కార్మికుల సొమ్మును వారి సంక్షేమ కోసమే ఖర్చు చేయాల్సింది పోయి దుర్వినియోగం చేయడం అత్యంత బాధాకరమన్నారు. సింగరేణిలో 49 శాతం వాటా కేంద్ర ప్రభుత్వానిది ఉంటుందని 51 శాతం రాష్ట్ర ప్రభుత్వానిది ఉంటుందన్నారు. కంపెనీలో కేంద్రం వాటా ఉన్న కూడా కేంద్రం పెత్తనం ఉండదన్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వానిదే ఉంటుందని స్పష్టం చేశారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని అభివృద్ధిలో నడిపించడంలో విఫలం కావడం విచారకరమన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్ రెడ్డి కృషి మేరకు నరేంద్ర మోడీ ప్రభుత్వం సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాకును కేటాయించడం జరిగిందన్నారు. ఈ బొగ్గు బ్లాకు కేటాయింపు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి దొరకడమే కాకుండా నాణ్యమైన బొగ్గు లభిస్తుందని తద్వారా కంపెనీకి మంచి ఆదాయం వస్తుందన్నారు.

సింగరేణి నిధులను రెండు ప్రభుత్వాలు వాడుకున్నాయి...

సింగరేణి కార్మికులు కష్టపడి కంపెనీకి ఆదాయం చేకూరుస్తుంటే అట్టి ఆదాయాన్ని గత కెసిఆర్ ప్రభుత్వం ఇప్పుడు ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాడుకుంటుందని బిజెపి జాతీయ నాయకురాలు పార్లమెంటు సభ్యులు డీకే అరుణ అన్నారు. ఎంతో చరిత్ర ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టే విధంగా ప్రభుత్వాలు ముందుకు పోవడం బాధాకరమన్నారు.

సింగరేణి కష్టాలను గమనించిన బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కృషితో నరేంద్ర మోడీ ప్రభుత్వం తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ ను సింగరేణికి కేటాయించడం జరిగిందన్నారు. ఫలితంగా సింగరేణి మళ్లీ అభివృద్ధిలోకి వస్తుందని పేర్కొన్నారు. సింగరేణి సొమ్ముతో సోకులు చేసిన బీఆర్ఎస్ కాంగ్రెస్ కు రానున్న ఎన్నికల్లో ప్రజలు కార్మికులు గట్టిగా బుద్ధి చెప్పాలని డీకే అరుణ పిలుపునిచ్చారు. ఈ సభ కార్యక్రమం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిజెపి అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపులో మరో కీలక అంకం

మొదటి పేజీ తరువాయి...

ఉచిత నాణ్యమైన విద్య : గుర్తింపు పొందిన ఉద్యమకారుల పిల్లలకు లేదా వారి తదుపరి తరానికి కేజీ నుండి పీజీ వరకు పూర్తి ఉచిత, నాణ్యమైన విద్యను ప్రభుత్వమే అందించాలి.

250 గజాల నివాస స్థలం:సొంత ఇల్లు లేని అర్హులైనప్రతి ఉద్యమకారుడి కుటుంబానికి నివాస అవసరాల నిమిత్తం 250 గజాల భూమిని కేటాయించి, రిజిస్ట్రేషన్ చేయించాలి.

గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్ :

వృద్ధాప్య దశలో ఉన్న ఉద్యమకారులు ఎవరిపైనా ఆధారపడకుండా, సమాజంలో ఆత్మగౌరవంతో బ్రతకడానికి వీలుగా గౌరవప్రదమైన జీవితకాల నెలవారీ పెన్షన్ ప్రతి నెల 1వ తేదీనే అందించాలి.

ఉచిత కార్పొరేట్ వైద్య సేవలు :

అన్ని ప్రభుత్వ మరియు గుర్తింపు పొందిన కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచితంగా అపరిమిత వైద్య సేవలు పొందేందుకు వీలుగా ప్రత్యేక హెల్త్ కార్డులను జారీ చేయాలి.

కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. "ఇవాళ సభలో ఉద్యమకారులు ప్రతిపాదించిన అంశాలను కచ్చితంగా ముఖ్య మంత్రి గారి నివేదిస్తాం. సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా జరుగుతున్న పూర్తి స్థాయి డిజిటల్ రికార్డింగ్ ఆధారంగా, ఒక్క నిజమైన ఉద్యమకారుడికి కూడా అన్యాయం జరగకుండా ఈ హక్కులను సాధించి తీరుతాం" అని గట్టి భరోసా ఇచ్చారు. జూలై 22 వరకు ఈ ముఖాముఖి షెడ్యూల్ నిరంతరాయంగా కొనసాగుతుందని, ఈ ప్రధాన అంశాలతో కూడిన సమగ్రమైన, చారిత్రాత్మక నివేదికను గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి సమర్పించి త్వరితగతిన జీవో జారీ అయ్యేలా కమిటీ బాధ్యత తీసుకుంటుందని ముగింపు ప్రసంగంలో స్పష్టం చేశారు.

# సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వ పాలన

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క పోషించిన కీలక పాత్రకు కృతజ్ఞతలు తెలుపుతూ సింగరేణి అధికార సంఘం నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు సంబంధించిన వివిధ సమస్యలను త్వరగా పరిష్కరించేలా సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని ఆయనను కోరారు. ఈ విజ్ఞప్తులపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క సోమవారం ఉదయం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ శ్రీ గౌతమ్ పోట్రుతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇంధన భద్రతను అందించడంలో సింగరేణి కార్మికులు, అధికారులు విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అధికారుల విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

అదేవిధంగా, మారుతున్న ప్రపంచీకరణ పరిస్థితులు, పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని, ఈ దిశగా అధికార సంఘం నాయకులు కూడా అధికారుల్లో సానుకూల దృక్పథం, కార్యోన్ముఖత పెంపొందించేలా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క సూచించారు.

ఉప ముఖ్యమంత్రికి సింగరేణి అధికార సంఘం నాయకుల కృతజ్ఞతలు

సింగరేణి సుస్థిర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్కకు సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు శ్రీ తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీ పెద్ది నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్కను కలిసి తమ సమస్యలను వివరించామని, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సత్వరమే పరిష్కరించాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయడంపై వారు ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి అభివృద్ధి, విస్తరణ, సుస్థిర భవిష్యత్ కోసం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అధికారుల తరఫున సంపూర్ణ మద్దతు అందిస్తూ, సంస్థ పురోగతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.

# పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది

## కేసీఆర్‌పై ఎంపీ చామల సెటైర్

హైదరాబాద్, జూలై 13 (ప్రజాకలం) :

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టికెట్ కోసం కొడుకు పేరు మార్చిన ఘనత కేసీఆర్ ది అంటూ వ్యాఖ్యానించారు. మంత్రి పదవి రాలేదనే కేసీఆర్ టీడీపీ నుంచి బయటకు వచ్చారన్నారు. పార్టీ పెట్టి ఎలక్షన్లు, కలెక్షన్లు చేసిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రక్తదాహం, ధనదాహం, అధికార దాహం ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఇంటికి పరిమితం చేశారన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని ఎంపీ తెలిపారు. విద్యార్థులను రెచ్చగొట్టి బలిదానాలకు కారణమైంది బీఆర్ఎస్ అంటూ ఆరోపించారు. పిట్ట కథలు చెప్పి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. కమీషన్లు దండుకోవడం తప్ప ఎకరానికి కూడా కేసీఆర్ నీళ్లు ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. 'పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది' అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సెటైర్ విసిరారు. 2009లో కేటీఆర్ తెలంగాణ ఉద్యమంలోకి వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులను కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలూ



ఒక్కటే అని.. ఈటల రాజేందర్‌ను ఎంపీగా గెలిపించింది బీఆర్ఎస్ అంటూ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు గుప్పించారు.

# ఎల్-నినో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సర్వసన్నద్ధం

మొదటి పేజీ తరువాయి...

వీలుగా తట్టుకొనే పంటలు మరియు రకాలు, ఇప్పటికే సాగు చేసిన పంటలలో తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి యాజమాన్య చర్యను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, జిల్లాల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అనుబంధరంగ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు.తరువాత మాట్లాడిన వ్యవసాయశాఖ డైరెక్టర్ గారు.. ఎల్-నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం, మధ్యలో దీర్ఘకాలిక పొడి పరిస్థితులు , అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు.జూలై 15 వరకు వర్షాలు ఆలస్యమైతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, జూలై 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగస్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసి ముందుగానే అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఆ తరువాత మాట్లాడిన ఇరిగేషన్ శాఖ , భూగర్భజలశాఖ, మరియు మిగతాశాఖ అధికారులు మంత్రిగారికి నీటిలభ్యత వివరాలు మరియు విద్యుత్ సరఫరాకు సంబంధించిన రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 33 జిల్లాల వర్షపాతం పరిస్థితులను ప్రభుత్వం రోజువారీగా సమీక్షించాలని మంత్రి తెలిపారు. ప్రస్తుత నివేదిక ప్రకారం 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, 20 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉందన్నారు. వర్షాభావ జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాల్సిందిగా సూచించారు.

శాస్త్రీయ విధానాలతో ఎల్-నినోను ఎదుర్కోవాలని, దీనికి సంబంధించి రాష్ట్రంలో విధానాన్ని అమలు చేయాలని మంత్రి సూచించారు. ఇందులో భాగంగా నిజ సమయ వర్షపాతం పర్యవేక్షణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు, నేల తేమ పర్యవేక్షణ, పంటల ఎదుగుదల అంచనా, వాతావరణ ప్రమాద విశ్లేషణ, ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళిక, పొలంలోనే నేల తేమ సంరక్షణ చర్యలు, పంటల వైవిధ్యీకరణ వంటి శాస్త్రీయ విధానాలను అమలు చేయాలని ఆదేశించారు. వాతావరణ, భూగర్భజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై మండలాల వారీగా వారపు బులెటిన్ ఎల్-నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలంటే వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని మంత్రి తుమ్మల అన్నారు. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ , నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో ప్రతి వారం మండలాల వారీగా సమగ్ర వ్యవసాయ-వాతావరణ బులెటిన్ విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు నెలాఖరు వరకు ప్రతి వారం విడుదల చేసే ఈ బులెటిన్‌లో మండలాల వారీగా నమోదైన వర్షపాతం, రాబోయే వారానికి, నెలాఖరు వరకు ఉండే వాతావరణ పరిస్థితుల అంచనాలు, డ్రై స్పెల్స్ ఏర్పడే అవకాశాలు, గరిష్ఠ-కనిష్ఠ ఉష్ణోగ్రతలు, నేల తేమ పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత, సాగునీటి పరిస్థితి, విద్యుత్ సరఫరా, పంటల స్థితి, రైతులు చేపట్టాల్సిన యాజమాన్య చర్యలతో పాటు నీటిపారుదల శాఖ ప్రాజెక్టుల క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో ఈ నెల, వచ్చే నెలకు సంబంధించిన వాతావరణ అంచనాలను విశ్లేషించి, ఆయా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉండే నీటి నిల్వలు, ఇన్‌ఫ్లోలు, సాగునీటి లభ్యతపై ఖచ్చితమైన అంచనాలను కూడా బులెటిన్‌లో పొందుపరచాలని మంత్రి స్పష్టం చేశారు. భూగర్భ జలాల శాఖ మండలాల వారీగా భూగర్భ జలాల లభ్యతపై తాజా సమాచారాన్ని అందించి, నీటి వినియోగ ప్రణాళికను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ వారపు బులెటిన్‌ను రైతు వేదికలు, గ్రామపంచాయతీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికలు, డిజిటల్ ప్లాట్‌ఫారాలు, స్థానిక మీడియా ద్వారా విస్తృతంగా రైతులకు చేరవేయాలని, రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రీయ సమాచారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.

లిశాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య చర్యలను అమలు చేయాలిలి ఇక్రిశాట్‌లో జరిగిన సమీక్షలో శాస్త్రవేత్తలు వర్షాకాలం ఆలస్యంగా ప్రారంభమవడం, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక సూచనలు చేశారు. వర్షపాతం నమోదై భూమిలో తగినంత తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలని, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో లేదా రిడ్జ్ అండ్ ఫరో పద్ధతులను అనుసరించాలని, భూమిలో తేమ ఏర్పడే వరకు ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని, నేల తేమను కాపాడేందుకు తరచూ ఇంటర్ కల్టివేషన్ చేపట్టాలని, వర్షాలు కురిసిన తర్వాత మాత్రమే సిఫార్సు చేసిన మోతాదులో నత్రజని, పొటాష్ ఎరువులు వేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. అలాగే పంటల కీలక ఎదుగుదల దశల్లో ప్రాణాధార నీటిపారుదల అందించడం, వరుస పంటల్లో స్కిప్ రో ఇరిగేషన్ అమలు చేయడం, దీర్ఘకాలిక పొడి పరిస్థితుల్లో 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని ఆకులపై పిచికారీ చేయడం, ప్రతి 3.6 మీటర్లకు ఒక డెడ్ ఫరో ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించడం, వ్యవసాయ కుంటల్లో నిల్వ చేసిన నీటిని అవసరమైన సమయంలో వినియోగించడం, అంతర పంటలను ప్రోత్సహించడం, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను తప్పనిసరిగా పాటించాలని శాస్త్రవేత్తలు సూచించారని మంత్రి తెలిపారు.

# 96,81,855 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్ల పంపిణీ ప్రారంభం

## రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్, జూలై 13 (ప్రజాకలం) :

పిల్లల్లో నులిపురుగుల (నట్టలు) సమస్యను నివారించేం దుకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆల్బెండజోల్ ట్యాబ్లెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ స్కూల్ పిల్లలకు మంత్రి ట్యాబ్లెట్స్ పంపిణీ చేశారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పిల్లల్లో నులిపురుగులు ఉండడం వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, బరువు తగ్గడం వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ సమస్యల కారణంగా చదువుపై పిల్లల శ్రద్ధ తగ్గిపోయే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. నులిపురుగులు బయటకు కనిపించకపోయినా పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, అందుకే ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా వేయించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ మాత్ర వల్ల నులి పురుగుల సమస్య తొలగిపోయి పిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుందని, తిన్న ఆహారంలోని పోషకాలు శరీరానికి బాగా అందుతాయని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని, చదువుపై ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం కూడా మెరుగుపడుతాయని వివరించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం మాత్రలు వేయడంతోనే ముగిసిపోదని మంత్రి పేర్కొన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన తాగునీరు ఉపయోగించడం, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి తినడం వంటి మంచి అలవాట్లపై కూడా పిల్లలకు, వారి తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు.

విద్యాశాఖ, మహిళా-శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ఆరోగ్య శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సున్న 96,81,855 మంది చిన్నారులు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈరోజు ఏ కారణంతోనైనా మాత్ర వేయించుకోలేకపోయిన పిల్లలకు జూలై 20న మాప్-అప్ కార్యక్రమం ద్వారా తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్ర వేయనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగెందర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, హైదరాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వ పాలన

మొదటి పేజీ తరువాయి...

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా వారికి పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. మహిళలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తున్నామన్నారు. ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడంతో మహిళా సంఘాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు.

ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 25 వేల కోట్లకు పైగా నిధులను మంజూరు చేయడం గర్వకారణమన్నారు. గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచడం ద్వారా కరువు పరిస్థితుల్లోనూ తాగు, సాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. ఉమ్మడి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీటిని అందించడం జరుగుతుందన్నారు. గట్టు ఎత్తిపోతల పథకాన్ని కూడా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. మహిళా, రైతు, యువజన సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రోడ్లకు మహర్దశ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం హామ్ రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేసిందన్నారు. గతంలోనూ మంత్రి జూపల్లి సహకారంతో గద్వాల నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ రహదారుల నిర్మాణానికి రూ.40 కోట్ల నిధులను మంజూరు చేశారని గుర్తు చేశారు. నిరుద్యోగ యువతకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. గద్వాల నియోజకవర్గంలో



పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఇటీవల ముఖ్యమంత్రి గుడ్డెందొడ్డి రిజర్వాయర్ ను సందర్శించి దాని సామర్థ్యాన్ని 15 టిఎంసిలకు పెంచేందుకు ప్రతిపాదించడం జరిగిందన్నారు. అంతకుముందు ధరూర్ కు చేరుకున్న మంత్రులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందజేసి, శాలువాలతో సన్మానించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, గొర్రెలు మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ సరిత, వాల్మీకి బోయ కార్పోరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, డిఈ భాస్కర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో ఘనంగా టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 13 (ప్రజా కలం) కోరుట్ల పట్టణంలో టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులువ్ చర్లపల్లి అమరదీప్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు తాండ్ర శ్రీనివాస్, మరిపల్లి మాధవి ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరదీప్ గౌడ్ మాట్లాడుతూ, కోరుట్ల నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొండ యుగేందర్, పోతారం రమేష్, దొనకొండ సుజాత, పోలిచాలిమేళ లత, నీలగిరి రాజేందర్ రావు, బొంగోని మల్లేష్ గౌడ్, ఒద్దినేని వెంకటేష్, ఎం.డి. ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి



రుద్రంగి, జూలై 13, (ప్రజాకలం ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 14 మంది లబ్దిదారులకు రూ. 5 లక్షల 40 వేల సిఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా వాటిని సోమవారం సర్పంచ్ గండి నారాయణ, ఏఎంసీ చెర్మెన్ చెలుకల తిరుపతి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిరుపేదలు సీఎంఆర్ఎఫ్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్నవారికి అండగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిలిచారని, ఆయనకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీనివాస్, పల్లి గంగాదర్, దయ్యాల శ్రీనివాస్, శీలం మీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలు, కేసుల పురోగతి పై చర్చ




రుద్రంగి, జూలై 03, (ప్రజాకలం ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ సిబ్బందితో కలిసి ప్రత్యేక క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతలు మరియు కేసుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. స్టేషన్ పరిధిలో నమోదైన వివిధ కేసుల పురోగతిని, ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో రాత్రి వేళల్లో దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా రాత్రి గస్తీని మరియు పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని, ప్రజలతో మమేకమవుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అవలంబించాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రుద్రంగి, చందుర్తి, కొనరావుపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు ఉన్నతాధికారులు పాల్గొని, శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు.

# విద్యుత్ కార్యాలయంలో భద్రతా సమీక్ష సమావేశం

గొల్లపల్లి జూలై 13 ప్రజా కలం ప్రతినిధి
గొల్లపల్లి మండల కేంద్రంలోని స్థానిక విద్యుత్ కార్యాలయంలో జగిత్యాల డీఈఓ సేఫ్టీ ఆఫీసర్ శ్రీ కె. గంగారాం ఆధ్వర్యంలో భద్రత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సిబ్బందికి సేఫ్టీ పెప్ టాక్ నిర్వహించి, విద్యుత్ పనుల నిర్వహణలో ప్రతి ఉద్యోగి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి తన ప్రాణానికి, తన కుటుంబానికి ఉన్న విలువను గుర్తుంచుకొని అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ప్రమాదాల నివారణ లక్ష్యంగా అందరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.
అనంతరం సెక్షన్ పరిధిలోని అన్ని ముఖ్యమైన పనితీరు సూచికలు (పారామీటర్లు) ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, శాఖ నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. జెన్‌కో వైటీపీఎస్ పవర్ ప్లాంట్‌లోని సి హెచ్ పిడ ఏ హెచ్ పి యూనిట్లను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.
ఈ సమావేశంలో ఏడీఈ శ్రీ పి. వరుణ్ కుమార్, ఏఈ శ్రీ కె. రాకేష్ కుమార్, గొల్లపల్లి, చిల్వకొడూరు సెక్షన్‌ల సబ్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

### - వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 13 (ప్రజా కలం) మౌలిక వసతుల కల్పన కు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు తెలిపారు. మెట్‌పల్లి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 13, 14వ వార్డుల్లో సుమారు 500 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రహదారి 13, 14, 15, 1, 23 వార్డుల ప్రజలకు ఎంతో కీలకమైనది. ముఖ్యంగా తొమ్మిది కుల సంఘాలకు చెందిన అంత్యక్రియల ఊరేగింపులు ఈ మార్గం ద్వారానే సాగుతుండటంతో, దాదాపు 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణం ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు 1వ వార్డులోని శ్రీ బంగారు పెద్దమ్మ తల్లి దేవాలయం, 2వ వార్డులోని శ్రీ హనుమాన్ దేవాలయం, 3, 4వ వార్డుల్లోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం, 5వ వార్డులోని శ్రీ ఆరపేట శివాలయం, 10వ వార్డులోని ఎమ్మార్వో కార్యాలయం, 11వ వార్డులోని శ్రీ చిలుకల చిన్నమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేయనున్న మినీ వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. అలాగే 1వ వార్డులో ఐమాక్స్ లైటింగ్‌ను ప్రారంభించారు. అనంతరం 12వ వార్డులోని అర్బన్ కాలనీలో అమృత్ 2.0 పథకం కింద సుమారు 100 తాగునీటి నల్లా కనెక్షన్లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ, మెట్‌పల్లి పట్టణంలో రహదారులు, తాగునీటి సౌకర్యాలు, మినీ వాటర్ ట్యాంకులు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వేంపేట విద్యార్థి అభిరామ్ ప్రతిభ

### - మార్గదర్శి కాన్వెంట్ స్కూల్‌లో ఘన సన్మానం

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 13 (ప్రజా కలం) మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన మార్గదర్శి కాన్వెంట్ స్కూల్ విద్యార్థి మారు అభిరామ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు. హైదరాబాద్‌లోని గార్డియమ్ స్పోర్ట్స్ స్కూల్లో జూలై 12న నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ 60 మీటర్ల పరుగుపందెంలో అభిరామ్ తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఏలేటి లక్ష్మి సాల్వ విద్యార్థిని ఘనంగా సన్మానించి, రాష్ట్రస్థాయిలో అందుకున్న ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, ఆటల ద్వారా మానసిక ఉల్లాసం, ఉత్సాహం, జ్ఞాపకశక్తి, క్రమశిక్షణ పెరుగుతాయని అన్నారు. పాఠశాలలో ప్రతిరోజూ నిర్వహించే క్రీడా కార్యక్రమాల



ఫలితంగానే అభిరామ్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాడని పేర్కొన్నారు.
విద్యార్థిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అభిరామ్ తండ్రి మారు అనిల్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు వినయ, ఉపాధ్యాయులు కటకం రచన, ప్రతిభ, రమ్య, కావ్య, నీలిమ, సువర్ణ, శ్రీకళ పాల్గొన్నారు.

# మెట్‌పల్లి మండలంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం విజయవంతం

### పాఠశాలల్లో ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ – డా. ఎల్లాల అంజిత్ రెడ్డి



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 13(ప్రజా కలం) మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు మండల వైద్యాధికారి ఎల్లాల అంజిత్ రెడ్డి తెలిపారు. వెంపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం మండల వైద్యాధికారి ఎల్లాల అంజిత్ రెడ్డి వెంపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి కార్యక్రమం అమలును పరిశీలించారు. విద్యార్థులకు మాత్రలు సరైన విధానంలో అందజేయడం, రికార్డుల నిర్వహణ, ఉపాధ్యాయులు-వైద్య సిబ్బంది సమన్వయాన్ని పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంవత్సరానికి రెండుసార్లు నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల సమస్యలు తగ్గి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు ఏర్పడుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందించాలని కోరారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని, ఆరోగ్య శాఖ, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సిబ్బంది సమిష్టి కృషితో కార్యక్రమం సజావుగా పూర్తయ్యిందని ఎల్లాల అంజిత్ రెడ్డి పేర్కొన్నారు.

# బాధితుల ఫిర్యాదులు పారదర్శకంగా విచారణ

### - గ్రీవెన్స్ డేలో ప్రజా సమస్యలపై స్పందించిన ఎస్పీ

జగిత్యాల ప్రతినిధి జులై 13 (ప్రజాకలం)
ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 15 మంది అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుకు సంబంధించిన పత్రాలను పరిశీలించి, చట్టపరంగా న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల అంశాలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో నిర్లక్ష్యం లేదా లోపాలకు తావు లేకుండా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు






అందించేందుకు కట్టుబడి ఉందని, ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల ప్రతినిధి జూలై 13 (ప్రజాకలం)
ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి, ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్నారని తెలిపారు. శాఖల వారీగా స్వీకరించిన అర్జీలపై అధికారులు సానుకూలంగా స్పందించి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 87 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జాతీయ జల మిషన్ - క్యాచ్ ద రైన్ కార్యక్రమంలో భాగంగా నీటిని ఆదా చేయడం, ప్రతి నీటి చుక్కను సంరక్షించడం, వర్షపు నీటిని సేకరించేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు జల ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజ్ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీల్లో వేంపేట విద్యార్థి ప్రతిభ పాఠశాలలో సన్మానం

మెట్ పల్లి రూరల్, జూలై 13 (ప్రజా కలం):మెట్ పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన మార్గదర్శి కాన్వెంట్ స్కూల్ విద్యార్థి మారు అభిరామ్ తండ్రి అనిల్ రెడ్డి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 12న హైదరాబాద్‌లోని



గార్డియమ్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ 60 మీటర్ల రన్నింగ్ పోటీల్లో అభిరామ్ ఉత్తమ ప్రదర్శన చాటాడు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో కరస్పాండెంట్ ఏలేటి లక్ష్మి విద్యార్థిని శాలువాతో సన్మానించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు సాయంత్రం పాఠశాలలో ఆటలు ఆడించడం వల్లే విద్యార్థి ఈ స్థాయికి చేరాడని, ఆటల వల్ల జ్ఞాపకశక్తి, మానసిక ఉల్లాసం పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఏనుగు వినయ్, ఉపాధ్యాయులు రచన, ప్రతిభ, రమ్య, కావ్య, నీలిమ, సువర్ణ, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం

గొల్లపల్లి జూలై 13 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలం రాఘవపట్నం



గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల ,అంగన్‌వాడీ కేంద్రాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ గౌడ్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్య సంరక్షణలో నులిపురుగుల నిర్మూలన అత్యంత కీలకమని పేర్కొన్నారు. నులిపురుగులు చేరడం వల్ల పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం ఏర్పడి శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతింటుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ మాత్రలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్, ఏ ఎన్ ఎం బుజ్జమ్మ అంగన్‌వాడీ టీచర్ మడ్డి జలజ, ఎస్ రమాదేవి,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు న్యాయం చేయాలని దొగ్గలి శ్రీధర్ డిమాండ్



ధర్మపురి, జూలై 13 : ( ప్రజా కలం ప్రతినిధి ) లాంగ్ స్టాండింగ్ లో ఉన్న జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ అధికారులను తక్షణమే బదిలీ చేయాలని దొగ్గలి శ్రీధర్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేయాలంటే అధికారులను తక్షణమే బదిలీ చేయాలని ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేయడం పారదర్శకతకు విరుద్ధమని, విద్యార్థుల భవిష్యత్తు తో ఆడుకోవద్దని, పరిపాలనలో తాజాధనం, వ్యయం పారదర్శకత కోసం బదిలీలు తప్పనిసరి అని కరీంనగర్ జిల్లాలోని డిఫెన్స్ అకాడమీలు గత ఐదు సంవత్సరాలుగా 2019-2024 విద్యార్థులు సాధించిన ఉద్యోగాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని, పారదర్శకతనే మా హక్కు మా భవిష్యత్తుకు ఇదే న్యాయమని దొగ్గలి శ్రీధర్ డిమాండ్ చేశారు.

ప్రజా కలం
మంగళవారం, జూలై 14, 2026

# తెరపైకి మెన్ కమిషన్

ఇది అత్యంత బాధాకరమైన విషయం.. ఎందుకంటే జరుగుతున్న సంఘటనలు అలా ఉన్నాయి కాబట్టి. గతంలో ఎన్నడూ కూడా ఈ విధంగా లేదు.. ఇలాంటి సంఘటనలు జరగలేదు. కానీ ఇప్పుడు ఒక దాని తర్వాత ఒకటి చోటు చేసుకుంటున్నాయి. ఎలా ఉంటున్నాయి అంటే.. ఒకదాన్ని మించి మరొకటి ఉంటున్నాయి. పైగా భయాన్ని కలగజేస్తున్నాయి. జీవితంలో పెళ్లి అంటేనే వెన్నులో వణుకు పుట్టే విధంగా చేస్తున్నాయి. పూణేలో కేతన్ అగర్వాల్ ను అతనికి కాబోయే భార్య సియా, ఆమె ప్రియుడు చేతన్ చంపేసిన తర్వాత.. ఆ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత.. ఈ కేసు కు సంబంధించిన అనేక సంచలన నిజాలు ఒకదాని వెంట ఒకటి బయటపడుతున్న తర్వాత.. మనదేశంలో ఒక రకమైన చర్చ నడుస్తోంది. ఆ చర్చ ఏకంగా పార్లమెంట్ దాకా వెళ్ళింది. పైగా పెద్ద పెద్ద రాజకీయ నాయకులు కూడా జరుగుతున్న పరిణామాలను చూసి భయపడుతున్నారు. దేశంలో ఒక వింత, విచిత్రమైన, మునుపెన్నడూ ఊహించని చర్చ మొదలైంది. ఇప్పటివరకు 'మగాడ్రా బుజ్జీ.. నీకేం తక్కువ?' అంటూ మీసాలు తిప్పిన పురుష పుంగవుల కోసం ప్రత్యేకంగా ఒక కమిషన్ కావాలంటూ రాజ్యసభ ఎంపీ అశోక్ కుమార్ మిట్టల్ ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును పార్లమెంట్‌లో పడేశారు. "జాతీయ మహిళా కమిషన్" తరహాలోనే, ఇకపై "జాతీయ పురుషుల కమిషన్" కూడా పెట్టాలని ఆయన డిమాండ్. ఈ బిల్లు బయటకొచ్చిందో లేదో.. పుణెలో జరిగిన కేతన్ అగర్వాల్ హత్య కేసు పుణ్యమా అని సోషల్ మీడియాలో 'మెన్ ఆర్ ఆల్సో హ్యూమన్స్' (మగాళ్లు కూడా మనుషులే) అనే ట్రెండ్ ఊపందుకుంది. కన్నీళ్లు పెడుతున్న 'కండల వీరులు' సమాజంలో మగాడంటే ఎప్పుడూ స్ట్రాంగ్‌గా ఉండాలి, ఏడవకూడదు.. భరించాలి అనే రూల్స్ ఉన్నాయి కదా! కానీ ఈ బిల్లు తెచ్చిన లెక్కలు చూస్తుంటే మగాళ్ల గుండెల్లో దాగున్న బాధలు హిమాలయాలంత ఉన్నట్టు కనిపిస్తోంది. ఇంట్లో భార్య చేతిలో లేదా బెల్లం ముక్క లాంటి అత్తగారి చేతిలో దెబ్బలు తిన్నా బయటకు చెప్పుకోలేక కుమిలిపోయే భర్తలు ఎందరో.. ఎక్స్ లోనో, పోలీస్ స్టేషన్ లోనో ఒక్క తప్పుడు కేసు పడితే.. కెరీర్ గోవిందా! విడాకులయ్యాక పిల్లల్ని చూడనివ్వకుండా కేవలం మెయింటెనెన్స్ డబ్బుల కోసం మాత్రమే వాడుకునే 'ఏటీఎం' మిషన్లుగా మగాళ్లు మారుతున్నారట. ఆఫీసు ఒత్తిళ్లు, సామాజిక అంచనాలు తట్టుకోలేక దేశంలో పురుషుల ఆత్మహత్యల శాతం రాకెట్‌లా దూసుకెళ్తుంటే.. "అయ్యో పాపం" అనే నాథుడే కరువయ్యాడని పురుషుల హక్కుల సంఘాలు గొంతు చించుకుంటున్నాయి. ఒకవేళ దేవుడు కరుణించి అంటే పార్లమెంట్ ఒప్పుకొని ఈ కమిషన్ ఏర్పాటైతే.. మగాళ్లకు ఒక 'సేఫ్ జోన్' దొరుకుతుంది. "మా ఆవిడ నన్ను రోజుకు పదిసార్లు తిడుతోంది సార్" అని ఏడ్చే భర్తలకు ఉచితంగా టిష్యూ పేపర్లు, మానసిక ధైర్యం ఇస్తారు. ఉచిత న్యాయ సహాయం కింద తప్పుడు కేసుల నుంచి ఎలా తప్పించుకోవాలో లాయర్లతో ఫ్రీగా సలహాలు ఇప్పిస్తారు. అలిగిన భర్తలకు, అత్తగారి వేధింపులకు గురయ్యే అల్లుళ్లకు ఇదొక పెద్ద దిక్కు అవుతుంది."మేమేదో మహిళల హక్కులను లాగేసుకుందామని చూడట్లేదు బాబోయ్! వాళ్ల చట్టాలు వాళ్లకుండనివ్వండి.. మాకు కనీసం ఒక చిన్న కంప్లైంట్ బాక్స్ అయినా ఇవ్వండి" అని బిల్లు ప్రతిపాదకులు చేతులు జోడించి మరీ చెప్తున్నారు. చట్టం అవుతుందా.. లేక చాయ్ బిస్కెట్ ముచ్చటవుతుందా? మన దేశ పార్లమెంట్ చరిత్ర చూస్తే 'ప్రైవేట్ మెంబర్ బిల్లులు' చట్టాలుగా మారడం అనేది.. లాటరీలో కోటి రూపాయలు తగలడం కంటే అరుదు. కాబట్టి ఈ బిల్లు రేపో మాపో చట్టం అయిపోయి, మగాళ్లందరికీ రక్షణ వచ్చేస్తుందని పగటి కలలు కనడం కాస్త అత్యాశే అవుతుంది. అయినప్పటికీ "మగాడికి కూడా మనసుంటుంది, వాడికీ కష్టాలొస్తాయి" అనే ఒక టాపిక్ మీద పార్లమెంట్ లో చర్చ జరగడమే ఒక పెద్ద అద్భుతం. మరి ఈ పురుషుల కమిషన్ ముచ్చట ఎంతవరకు వెళ్తుందో అధికార పక్షం దీనిపై ఎలాంటి 'పంచ్‌లు' వేస్తుందో చూడాలి. అంతవరకు.. ఆల్ ది బెస్ట్ మగాళ్లూ! మీ బాధలను వినడానికి కనీసం ఒక బిల్లు అయినా పుట్టుకొచ్చింది, సంతోషించండి.. ఇది పద్ధతి కాదు.. ఇది విధానం కాదు.. దీనికి పాడాలి చరమగీతం అన్నట్టుగా మాట్లాడుతున్నారు. ఇటీవల కాలంలో మగవాళ్ళను ప్రియురాళ్లు, భార్యలు చంపేస్తున్న నేపథ్యంలో.. ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. పెళ్లి చేసుకోవాలంటే మగవాళ్ళు భయపడిపోతున్నారు. అసలు ఇలా కూడా జరుగుతుందా.. ఇలా ప్రాణాలు తీస్తుంటే ఇక పెళ్లిళ్లు ఎందుకు చేసుకోవాలని మగవాళ్ళు ప్రశ్నిస్తున్నారు. ఒంటరి జీవితమే బాగుంటుందని.. ఒంటరిగా మిగిలిపోవడమే గొప్పగా ఉంటుందని భావిస్తున్నారు. మగవాళ్ళ బాధలు చూడలేక కొన్ని సందర్భాలలో రాజకీయ నాయకులూ స్పందిస్తున్నారు. తాజాగా అశోక్ కుమార్ అనే రాజ్యసభ సభ్యుడు పెద్దల సభలో కీలక వ్యాఖ్యలు చేశాడు. మగవాళ్ళ మీద రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని.. మగవాళ్ళను చంపేస్తున్నారని.. మగవాళ్ళ ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయిందని.. చెబుతూ.. మగ వాళ్లకు కూడా కమిషన్ ఏర్పాటు చేయాలని.. ఆడవాళ్ళ నుంచి మగవారిని కాపాడాలని ఆయన సాక్షాత్తు పెద్దల సభలో వ్యాఖ్యానించడం విశేషం. అయితే ఆయన చేసిన వ్యాఖ్యల పట్ల మెజారిటీ ప్రజల నుంచి సానుకూల ప్రకటన రావడం గమనార్హం.

# ప్రజల అండదండలతోనే ఈ స్థాయికి : డాక్టర్ రఘు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 13( ప్రజా కలం) భారతీయ జనతా పార్టీలో గాడ్ ఫాదర్ లేకుండా నియోజకవర్గ ప్రజల అండదండలతోనే ఈ స్థాయికి తాను ఎదిగానని డాక్టర్ రఘు వెల్లడించారు. కోరుట్ల నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం తాను నిరంతరం కృషి చేశానని, పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. బీజేపీకి రాజీనామా ప్రకటించిన అనంతరం డాక్టర్ రఘు సోమవారం కోరుట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భావోద్వేగంతో మాట్లాడారు. పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను సిద్ధాంతాలకు అనుగుణంగా, పార్టీ బలోపేతమే లక్ష్యంగా నిర్వర్తించానని తెలిపారు. ఈ ప్రయాణంలో తనతో కలిసి నడిచిన ప్రతి కార్యకర్తకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, తన వల్ల ఎవరికైనా ఇబ్బంది కలిగి ఉంటే మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరారు. రాజకీయంగా మార్గాలు వేరు అయినా కార్యకర్తలతో తన అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని, వారికి ఎలాంటి అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మెట్పల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ 10 స్థానాల్లో విజయం సాధించడం ప్రతి కార్యకర్త కష్టానికి దక్కిన ఫలితమని పేర్కొన్నారు. ఈ విజయాన్ని ఒక్కరి విజయంగా కాకుండా, పార్టీ జెండాను మున్సిపాలిటీలో ఎగరవేయాలనే సంకల్పంతో ప్రతి కార్యకర్త చేసిన త్యాగం, కృషి ఫలితంగా భావిస్తున్నానని చెప్పారు. ఆ కృషిని పార్టీ అధిష్టానం గుర్తించాలని కోరారు.

కుటుంబంలాంటి పార్టీని వీడాల్సి రావడం తనకు కూడా బాధాకరమేనని, అయితే పార్టీ జాతీయ నాయకత్వంపై తనకు ఎలాంటి అభ్యంతరాలు లేవని తెలిపారు. పార్లమెంట్ సెగ్మెంట్ స్థాయిలో ఎదురైన కొన్ని పరిస్థితుల కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు. తన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయాన్ని ముందుగా కార్యకర్తలతో చర్చించి, అనంతరం ప్రజలకు వెల్లడిస్తానని తెలిపారు. తన వెంట నడిచిన కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.

రాజకీయాల్లో తనకు ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకపోయినా ప్రజలే అండగా నిలిచారని, ప్రజల విశ్వాసం, ప్రేమ, మద్దతు ఉన్నంతకాలం ఎలాంటి కుట్రలు, మోసాలు పనిచేయవని అన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తల అభిప్రాయాలను వినే బాధ్యత నాయకత్వంపై కూడా ఉంటుందని, ఆ విషయంలో లోటు కనిపించిందని వ్యాఖ్యానించారు. చివరిగా కోరుట్ల నియోజక వర్గ ప్రజలకు, బీజేపీ కార్యకర్తలకు, పార్టీ అభిమానులకు మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మెట్‌పల్లి బీజేపీలో అసంతృప్తి..

## – డాక్టర్ రఘు బాటలో కౌన్సిలర్ సుఖేందర్ గౌడ్ రాజీనామా

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 13 (ప్రజా కలం) మెట్‌పల్లి పట్టణ బీజేపీలో అసంతృప్తి మరింత తీవ్రరూపం దాల్చింది. గత శుక్రవారం పార్టీకి రాజీనామా చేసిన ముఖ్య నేత డాక్టర్ రఘు సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజీనామాకు గల కారణాలను వెల్లడించారు. ఇదే సందర్భంగా 18వ వార్డు కౌన్సిలర్ చర్లపల్లి మీన సుఖేందర్ గౌడ్ కూడా బీజేపీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. అనంతరం డాక్టర్ రఘు మాట్లాడుతూ తాను పార్టీకి రాజీనామా చేసినప్పటికీ బీజేపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. పార్టీ మారినంత మాత్రాన కార్యకర్తలకు దూరం కాదని, వారికి ఎలాంటి అవసరం వచ్చినా, కష్టసమయంలో తనను సంప్రదించవచ్చని, ఎప్పటిలాగే అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.'స్వలాభం కోసమే కార్యకర్తల వినియోగం'ఎంపీ ధర్మపురి అరవింద్ వైఖరిపై డాక్టర్ రఘు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించే కార్యకర్తలను వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదని విమర్శించారు. స్వలాభం కోసమే కార్యకర్తల శ్రమను వినియోగిస్తున్నారని ఆరోపించారు.

**సుఖేందర్ గౌడ్ విమర్శలు**

రాజీనామా అనంతరం కౌన్సిలర్ చర్లపల్లి మీన సుఖేందర్ గౌడ్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల సమయంలో ఎంపీ అరవింద్ మెట్‌పల్లిలో ప్రచారం చేయలేదని ఆరోపించారు. మెట్‌పల్లి మీదుగానే కోరుట్ల, జగిత్యాల, రాయికల్ ప్రాంతాలకు వెళ్లినప్పటికీ, పట్టణంలో ఒక్కరోజు కూడా ప్రచారం నిర్వహించలేదని విమర్శించారు. స్థానిక నాయకత్వాన్ని పూర్తిగా విస్మరించారని, పార్టీ కోసం కష్టపడుతున్న వారిని పక్కనబెట్టి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. బీజేపీలో ఉన్నప్పటికీ ఎంపీ అరవింద్‌లో కాంగ్రెస్ సంస్కృతి కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల కారణంగానే తాము పార్టీని వీడాల్సి వచ్చిందని ఆరోపించారు.

# ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి మరొకరికి తీవ్ర గాయాలు

## -మారేడుపల్లి గ్రామ శివారులో రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం

ఎండపల్లి, జూలై 13 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామ శివారులో రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వస్తూ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు కాగా మృతి చెందిన వ్యక్తి మారేడుపల్లి గ్రామానికి చెందిన దర్శనాల మల్లయ్య తన భార్యను వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు తన భార్యను దింపి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం దారుడు పొట్టాల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మరో ద్విచక్ర వాహనంపై వస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం లో మారేడుపల్లి గ్రామానికి చెందిన దర్శనాల మల్లయ్య తలకు తీవ్ర గాయాల య్యాయి వెంటనే ఆయనను కరీంనగర్ హస్పత్రికి తర లిస్తుండగా మార్గమధ్య లో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు మరో ద్విచక్ర వాహనంపై ప్రాణిస్తున్న ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం



హస్పత్రికి తర లించారు ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నట్లు గ్రామ సర్పంచ్ బాల్సాని శారద మల్లేశం గౌడ్ తెలిపారు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ బాల్సాని శారద–మల్లేశం గౌడ్ తెలిపారు.

# చిన్న వయసులోనే అరుదైన గౌరవం

## - కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బర్ల సూరి
## - జువ్వడి నేతృత్వంలో బర్ల సూరికి కీలక బాధ్యతలు



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 13(ప్రజా కలం):–

కోరుట్ల నియోజకవర్గం మెట్‌పల్లి మున్సిపాలిటీ 3వ వార్డుకు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు బర్ల సూరిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ "టీపీసీసీ" జగిత్యాల జిల్లా జనరల్ సెక్రటరీ (ప్రధాన కార్యదర్శి)గా నియమించింది. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత, అహర్నిశలు చేస్తున్న సేవలు, మరియు సత్ప్రవర్తనను గుర్తించి సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వడి నర్సింగరావు నేతృత్వంలో అధిష్ఠానం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే బర్ల సూరి ఇంత చిన్న వయసులోనే జిల్లా స్థాయి పదవిని కైవసం చేసుకోవడం పట్ల నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు ఆయనను కలిసి ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. తనపై నమ్మకంతో ఇంతటి కీలక బాధ్యతలను అప్పగించినందుకు జువ్వడి నర్సింగరావుకి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి బర్ల సూరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు స్థాయి నుంచి తనను గమనించి జిల్లా స్థాయిలో ఈ గుర్తింపు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కష్టపడతానని, కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గంలో తార స్థాయికి చేరవేర్చడమే తన లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి, పార్టీ శ్రేణుల సంక్షేమానికి నిరంతరం అందుబాటులో ఉంటానని బర్ల సూరి స్పష్టం చేశారు.

# జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



మల్లాపూర్ జూలై 13 ( ప్రజా కలం ప్రతినిధి)

మల్లాపూర్ మండలంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. రాఘవపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో కేతిరి దామోదర్ రెడ్డి, సర్పంచ్ తోట శ్రీనివాస్ పాల్గొని మాత్రలను పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా అల్బెండాజోల్ మాత్ర తీసుకోవాలని, ఇది నులి పురుగుల నివారణతో పాటు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడుతుందని ఎంఈవో దామోదర్ రెడ్డి తెలిపారు.
ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ విక్రమ్,ఉప సర్పంచ్ నర్సయ్య, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువత గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్న డిసిపి

## - పెద్దపల్లి డిసిపి భూక్య రామ్ రెడ్డి ఐపీఎస్ సూచన



ధర్మారం, జూలై 13 : ( ప్రజా కలం ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామం లో ఆదివారం రోజున రాత్రి పెద్దపల్లి డీసీపీ శ్రీ భూక్య రామ్ రెడ్డి ఐపీఎస్ మాట్లా డుతూ యువత గంజాయి కి మత్తు పదార్థాలకి దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సరే గంజాయి లేదా మత్తు పదార్థాల గురించి సమాచారం ఇవ్వాలని పెద్దపల్లి డిసిపి భూక్య రామ్ రెడ్డి ఐపీఎస్ కోరారు. ఈ కార్యక్రమం లో ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు, యువత పాల్గొన్నారు.

# కమ్మర్ ఖాన్ పేట్ లో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ మహేష్



ధర్మారం, జూలై 13 : ( ప్రజా కలం ప్రతినిధి )

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కమ్మర్ ఖాన్ పేట గ్రామం లో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం లో భాగంగా సోమవారం రోజున హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ ఇరుగురాల మహేష్ గ్రామ ప్రజలకు ఎస్ ఐ ఆర్ ఓటర్ నమోదు తప్పులు జరగకుండా ఉండాలని ఉద్దేశంతో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ఓటరు జాబితా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చేసుకోకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రతి ఒక్క ఓటరు ఈ ఓటరు జాబితా సవరణ ప్రక్రియ లో పాల్గొ నాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ ఉప సర్పంచ్, సెక్రటరీ, బి ఎల్ ఓ లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు సర్పంచ్ ఇరుగురాల మహేష్ తెలిపారు.

# టీఆర్ రిజిస్ట్రేషన్ లేకుండా వాహనాల విక్రయం..

## - షోరూం నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 13(ప్రజా కలం)

కోరుట్ల పట్టణంలోనీ పలు ద్విచక్ర వాహనాల షోరూంలపై రవాణాశాఖ అధికారులు సోమవారం రోజున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా రవాణాశాఖ అధికారి సంధాని మొహమ్మద్ ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సి.హెచ్. రామారావు, ఎం. సాయి చరణ్ తమ సిబ్బందితో కలిసి షోరూంలను తనిఖీ చేశారు. తనిఖీల్లో కొన్ని షోరూంలు తాత్కాలిక (టీఆర్) రిజిస్ట్రేషన్ లేకుండానే ద్విచక్ర వాహనాలను విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిబంధనలను ఉల్లంఘించిన షోరూంల యాజమాన్యాలకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేశారు.రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. వాహనాల విక్రయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు..



### ప్రజావాణి ఫిర్యాదుకు నాలుగు నెలలైనా

## చర్యలు లేవని గ్రామస్తుల ఆవేదన



( వరంగల్/ పర్వతగిరి) జూలై 13, ప్రజాకలం ప్రతినిధి.

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో 35 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ జెండా గద్దెగా ఉపయోగిస్తున్న స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించి, గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా గదులు నిర్మించారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయంపై నాలుగు నెలల క్రితమే ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి విచారణ గానీ, చర్యలు గానీ తీసుకోలేదని తెలిపారు. అక్రమ నిర్మాణాలను తొలగించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని జనగాం లక్ష్మణ్, గొల్లపల్లి మహేందర్, రామసాని కృష్ణ తదితర గ్రామస్తులు కోరారు.

## సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

### – సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ పిలుపు




పాలేరు జులై 13( ప్రజా కలం న్యూస్)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ. సిపిఎం ఆధ్వర్యంలో జులై 15 హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద జరిగే జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని యడవల్లి పద్మా రెడ్డి భవనంలో జరిగిన సిపిఎం సెంట్రల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.ఎన్నికల ముందు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ప్రతి సంవత్సరం లక్షల్లో ఉద్యోగాలు ఇస్తానని చెప్పి, ఎన్నికల ప్రచారంలో ఉదరగొట్టే ప్రసంగాలు చేసి, యువత ను ఓటర్లుగా ఉపయోగించుకొని తర్వాత యువతకు ఉద్యోగాల భర్తీకి ప్రసక్తే లేకుండా దాటేస్తున్నారని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి యువతను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితులలో నిరుద్యోగ యువతకు సరైన ఉద్యోగాలు అవకాశాలు లభించాలని కోరుతూ..ఈనెల 15 హైదరాబాదులోని ఇందిరా పార్క్ లో జరిగే మహాధర్నాకు అత్యధిక సంఖ్యలో యువకులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బిక్కసాని గంగాధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మతరావు, మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, మండల కమిటీ సభ్యులు చిట్టూరి వెంకన్న,ఎస్. కే. బాబు, గన్య నాయక్, వెంకటయ్య, నరసింహ నాయక్, కర్ణబాబు, జివ్వాజి శ్రీను, ప్రతాప్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### – పిఆర్టీయూ మరిపెడ మండల అధ్యక్షులు కీసర రమేష్ రెడ్డి




మరిపెడ ప్రజా కలం జూలై 13 ఉపాధ్యాయుల సమస్యల పై నిరంతరం గళం విప్పడమే మా లక్ష్యం అని పిఆర్టీయూ మండల అధ్యక్షులు కీసర రమేష్ రెడ్డి అన్నారు. 2026 సంవత్సర పిఆర్టీయూ సభ్యత్వ ముగింపును పురస్కరించుకొని సభ్యత్వ నవోదును మరిపెడ మండలంలోని సీతారాం పురం,వీరారం,కేజిబివి,మోడల్ స్కూల్,సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ పాఠశాలలో సభ్యత్వ నమోదు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని, ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న పిఆర్సి డీఏలను వెంటనే మంజూరు చేయాలని పెండింగ్ బకాయిలను వెంటనే మంజూరు చేయడానికి పిఆర్టీయూ సంఘం అవిశ్రాంతంగా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్,గౌరవ అధ్యక్షులు అర్జున్ సంఘ బాధ్యులు సునీల్ కుమార్,రవి,వెంకటయ్య,మధు,హరి,కవిత,శ్రీలత,ఉప్పలమ్మ,అనురాధ,సువర్ణ,సందీప్ కుమార్,రుబీన, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, జులై 13(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): 1 నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న వారందరికీ నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నిర్మల్ అర్బన్ మండలం సోఫీనగర్ ప్రభుత్వ



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆల్బెండజోల్ మాత్రల వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఆల్బెండజోల్ మాత్రల వల్ల నులిపురుగులు నశించి, రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం విధిగా మాత్రలను తీసుకోవాలని అన్నారు. విద్యార్థులంతా ఆహారం తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనారోగ్యానికి గురికాకుండా ఉండేలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డీఈవో భోజన్న, ఇమ్యూనైజేషన్ అధికారి నయనా రెడ్డి, అధికారులు రవీందర్, ప్రిన్సిపల్స్ డానియల్, తదితరులు పాల్గొన్నారు.

### మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల

# డిప్యూటేషన్ రద్దు చేసి బదిలీ చేయాలి

### - ప్రజావాణిలో కలెక్టర్‌కు బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ వినతి



జగిత్యాల్ ప్రతినిధి జూలై 13 (ప్రజా కలం)

మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల డిప్యూటేషన్ రద్దు చేసి బదిలీ చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్, మాజీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మెట్‌పల్లి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న డా. అమరేశ్వర్ డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేసి, మరో వైద్యుడు డా. సాజిద్ అహ్మద్ను బదిలీ చేయాలని వినతిలో కోరారు. డాక్టర్ అమరేశ్వర్ 2011లో మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి, అనంతరం జగిత్యాలకు బదిలీ అయినప్పటికీ తిరిగి డిప్యూటేషన్‌పై మెట్‌పల్లికే వచ్చి ఇప్పటి వరకు కొనసాగుతున్నారని తెలిపారు. అదే పట్టణంలో ఆయన ప్రైవేట్ ఆసుపత్రిని నిర్వహిస్తున్నందున వ్యక్తిగత ప్రయోజనాల కోసం పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్నారని ఆరోపించారు. అలాగే డాక్టర్. సాజిద్ అహ్మద్ 2008 నుంచి అదే ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో భారీ స్థాయిలో బదిలీలు చేపట్టినా వీరిద్దరిని మాత్రం బదిలీ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. వైద్యులు విధుల్లో సమయపాలన పాటించడం లేదని, రోగులు, ఆసుపత్రి సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ప్రభుత్వ సేవలకు కేటాయించాల్సిన సమయంలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో సేవలు అందిస్తున్నారని వినతిపత్రంలో ఆరోపించారు. అందువల్ల ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్ కొనసాగుతున్నట్లు తేలితే అమరేశ్వర్ డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేయడంతో పాటు, సాజిద్ అహ్మద్‌ను కూడా బదిలీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుంకె అశోక్, తాళ్లపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### - ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం, జూలై 13(ప్రజా కలం న్యూస్ )

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.

కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన ప్రజలు గ్రామ జనాభా అధికంగా ఉన్నందున తమ గ్రామానికి రెండవ రేషన్ దుకాణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి వసంత రాణి తాను ఇంటర్ చేశానని, ఖాళీగా ఉన్న ప్రీ ప్రైమరీ ఆయా పోస్ట్ కొరకు దరఖాస్తు చేసుకోగా మెరిట్ లిస్ట్ లో పేరు ఉన్నా కూడా పోస్ట్ రాలేదని, ఆయా పోస్ట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.



తల్లాడ మండలం గొల్లగూడెంకు చెందిన జి. సురేష్ తన కుమారుడు గుండ్ల సాత్విక్ కు వైరా బీసీ మహాత్మ జ్యోతి బాపూలే స్కూల్ నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్సిఓ బీసీ సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన డి.ఉపేంద్ర తనకు బ్లాక్ ఫంగస్ వచ్చి కంటిచూపు పోయిందని తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డీపీఎం, సదరంకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణే లక్ష్యం

### - మరిపెడ మండల వైద్యాధికారి గుగులోతు రవి

### - ముఖ్యులుగా హాజరైన మున్సిపాలిటీ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి సునీత రవీందర్ రెడ్డి



మరిపెడ ప్రజా కలం జూలై 13 మహబూబాద్ జిల్లా మరిపెడ మండల మరియు మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, మరియు కళాశాలల్లో సోమవారం 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత ఆల్బండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది అని. మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి అన్నారు ఆయన ఆధ్వర్యంలో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలం మరియు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 12,303 మంది పిల్లలకు గాను 11,689 మందికి మాత్రలు వేసి, 95 శాతం లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ రోజు వివిధ కారణాల వల్ల మాత్రలు వేసుకోలేకపోయిన మిగిలిన పిల్లలందరినీ తిరిగి ఈ నెల 20వ తారీఖున కవర్ చేయడం జరుగుతుందని వైద్యాధికారి తెలిపారు. మున్సిపాలిటీ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల మరియు కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ శ్రీమతి విశారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై, విద్యార్థినులకు మాత్రలు వేసి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పిల్లల్లో నులిపురుగుల నివారణకు మరియు వారి ఆరోగ్య సంరక్షణకు ఆల్బండాజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఆఫీసర్లు మరియు మరిపెడ మున్సిపాలిటీ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఆయా వార్డుల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ బాధ్యత

### చల్లూర్ ఉర్దూ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హుజురాబాద్ : వీణవంక మండలం చల్లూర్ గ్రామంలోని ఉర్దూ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన విధానం, తరగతి గదుల నిర్వహణ, మధ్యాహ్న భోజనం నాణ్యత, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య పరిస్థితులు, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు, పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, నమోదు వివరాలు, నిర్వహణను కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించి, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు అందించడం ప్రభుత్వ బాధ్యత.

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థుల భవిష్యత్తు కోసం అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తాం" అని తెలిపారు.

## ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు



( వరంగల్/ పర్వతగిరి) జూలై 13, ప్రజాకలం ప్రతినిధి. పర్వతగిరి మండలం ఎనుగల్లు గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు అధేశాల మెరకు స్థానిక నాయకలతో కలిసి పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి. ఈ సందర్భంగా ఇస్లావత్ సావిత్రి మాట్లాడుతూ ఓటర్లకు అవసరమైన అవగాహన ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీకి చెందిన బీఎల్ఎ లను భాగస్వామ్యం చేయాలని, ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేలా చుడలాని గ్రామ అధ్యక్షులకు సూచించారు. ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్క ఓటు తొలగించకుండా కాపాడుకునే భాధ్యత పార్టీ బిఎల్ఎ లూ, సర్పంచ్లను, గ్రామ పార్టీ అధ్యక్షులను సినియర్ నాయకులను, మండల, జిల్లా నాయకులను, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ,అనుబంధ సంఘల అధ్యక్షులను, మాజీ ప్రజాప్రతినిధులను, క్రియాశీల కార్యకర్తలను కోరినారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బోట్ల మహేంద్ర, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాసాని సువర్ణ, సినీయర్ నాయకులు బిక్షపతి, యాకూబ్ తధితరులు పాల్గొన్నారు.

### అన్నారం దర్గా చెరువు

## ఎఫ్‌టిఎల్‌లో అక్రమ ఆక్రమణలు

### - చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

### - గొల్లపెల్లి మహేందర్ టిడిపి నాయకులు



( వరంగల్/ పర్వతగిరి ) జూలై 13, ప్రజాకలం ప్రతినిధి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని దర్గా చెరువు ఎఫ్‌టిఎల్ (ఖీూ) పరిధిలో అక్రమ ఆక్రమణలు, మట్టి తవ్వకాలు, నిర్మాణ పనులు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గొల్లపెల్లి మహేందర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువు భూమిని పెద్ద పెద్ద గుంతలుగా తవ్వి ఎఫ్ టి ఎల్ పరిధిలో కుప్పలుగా పోసి చదును చేసి ఆక్రమించడం వల్ల చెరువు విస్తీర్ణం తగ్గి, నీటి నిల్వ సామర్థ్యానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై వెంటనే విచారణ జరిపించి, అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను నిలిపివేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చెరువు అసలు విస్తీర్ణాన్ని పరిరక్షించాలని కలెక్టర్‌ను కోరారు.

### ఎస్ఐఆర్ డేటా డిజిటలైజేషన్ ప్రక్రియను

## వేగవంతం చేయాలి

### - ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్



( వరంగల్/పర్వతగిరి) జూలై13, ప్రజాకలం ప్రతినిధి.పర్వతగిరి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న SIR డేటా డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా డేటా సేకరణ వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తగా పని చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ హరిత, పంచాయతీ కార్యదర్శి రఘు,జీపిఓ స్నేహలత, బూత్ లెవెల్ ఆఫీసర్ లు మెడిశెట్టి కరుణాకర్, నాదారపు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, జులై 13(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బోరిగాం సర్పంచ్ పల్లె జ్యోతి ఆత్మహత్య

నిర్మల్, జూలై 13(ప్రజా కలం జిల్లా ప్రతినిధి):



తానూర్ మండలంలోని బోరిగాం గ్రామ సర్పంచ్ పల్లె జ్యోతి (34) సోమవారం తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం ఆదివారం రాత్రి వరకు జ్యోతి తన తండ్రితో ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం ఉదయం ఆమె మృతి చెందిన విషయం బంధువుల ద్వారా కుటుంబ సభ్యులకు తెలియడంతో వెంటనే ఇంటికి చేరుకుని చూడగా ఉరివేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో, తన కుమార్తె కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేక జీవితంపై విరక్తి చెందిందని, ఈ కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి భర్త, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె ఆకస్మిక మృతితో బోరిగాం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## బట్టి విక్రమార్క సభ స్థలాన్ని పరిశీలించిన ప్రజా ప్రతినిధులు



ప్రజా కలం జులై 13 (గద్వాల ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని కుర్తి రావుల చెరువు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 1 గంటలకు నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కు వస్తున్నట్లు సర్పంచ్ కే.భగవంతు తెలిపారు.డిప్యూటీ సీఎం పర్యటన నిమిత్తం ఏర్పాటు మాజీ డిసిసి చైర్మన్ పటేల్ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ స్థలాన్ని ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి, నాయకులు వెంకట్ రెడ్డి, గ్రామస్తులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామంలో చాలాకాలంగా వేధిస్తున్న లో- వోల్టేజి సమస్య ఈ నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభంతో పూర్తిగా తొలగిపోనుంది. ముఖ్యంగా రైతాంగానికి వ్యవసాయ మోటార్ల కొరకు మరియు గృహ అవసరాలకు ఎలాంటి అంతరాయాలు లేకుండా నాణ్యమైన, నిరంతరం విద్యుత్ సరఫరా అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవన్న, భాస్కర్ గౌడ్, మాజీ కో ఆప్షన్ నెంబర్ మహబూబ్ అలీ,సీసీ మల్దకల్,బుడ్డన్న, కర్ణాకర్, పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ



ప్రజా కలం జూలై 13 (గద్వాల ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని పి.ఎం. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్దకల్ నందు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్దకల్ గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్ హాజరై విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జి. సురేష్ ,గ్రామ పెద్దలు గోపాల్,హెల్త్ సూపర్వైజర్ శ్రీ శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీ దేవన్న, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీ రామస్వామి, ఏఎన్ఎం శ్రీమతి పుష్ప, ఆశా కార్యకర్తలు శ్రీమతి బి. నర్సమ్మ,పరిమళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి సురేష్ మాట్లాడుతూ, ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకోవడం వల్ల పేగు పురుగుల నివారణ జరిగి విద్యార్థుల ఆరోగ్యం, ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. పరిశుభ్రత పాటించడం, ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా దాదాపు 550 మంది విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోలూర్ లో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పరిశీలించిన తహశీల్దార్

తానూర్,జులై 12(ప్రజా కలం): మండలంలోని కోలూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను సోమవారం తహశీల్దార్ మహేందర్ నాథ్ పర్యవేక్షించారు, ఈ సందర్భంగా ఆయన ఎస్.ఐ.ఆర్ నమోదు సరళిని క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు, ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని బీఎల్ఓలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు, విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని ఆయన ఆదేశించారు.



# జర్నలిస్టుల దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలి



### –టీ డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి వెంకటేశ్వర్లు

ప్రజా కలం జూలై 13 (గద్వాల ప్రతినిధి)

జర్నలిస్టుల సమస్యలపై టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు టి డబ్ల్యూ జేఎఫ్ యూనియన్ జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో ఇండ్లు, స్థలాలు, హెల్త్ కార్డులు, ఇవ్వాలని నినాదాలు చేశారు. తరువాత కలెక్టర్ కార్యాలయంలో ఏవో రాంభూపాల్ కి జర్నలిస్టుల డిమాండ్లతో లిఖితపూర్వకంగా వినతి పత్రం ఇవ్వడం జరిగింది. జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులు భారీ సంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషిచేస్తున్నారు. ఎండనక, వాననక విధుల్లో ఉంటున్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ ప్రాణాలకు తెగించి పోరాడారు. ఉద్యమం సందర్భంగా, ఆ తరువాత కూడా వందలాది మంది చనిపోయారు. పరిస్థితులు మారుతున్నాయి. టిడబ్ల్యూ జెఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వాల విధానాలు మారిపోతున్నాయి. కానీ, జర్నలిస్టుల బతుకుల్లో మాత్రం ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదు. ఉన్న రెండు వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను యూనియన్ గవర్నమెంట్ కోడ్ల కింద మార్చేసి హక్కులను కాలరాసింది. కార్మిక చట్టాలను తుంగలో తొక్కింది. అటు యూనియన్ ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధి, సంక్షేమ పథకాలను జర్నలిస్టులకు అందడం లేదు. చివరకు వృత్తి నిర్వహణకు కావాల్సిన అక్రిడిటేషన్ కార్డులు సైతం సకాలంలో ఇవ్వడం లేదు. అనేక ఉద్యమాల ఫలితంగా గత రెండు నెలల నుంచి అక్రిడిటేషన్ కార్డులు జారీచేస్తున్నారు. అర్హులైన వారందరికి ఇవ్వాలనేది తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ప్రధాన ఉద్దేశం. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీల్లో ఒక యూనియన్ వారికే అవకాశం ఇవ్వడం మూలంగా అన్యాయం జరుగుతున్నది. వెంటనే లోపాలను సవరించాలని డిమాండ్ చేస్తున్నాం. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్కార్డులిచ్చి ఆదుకోవాలని కోరుతున్నాం. ఇకపోతే గత 40 ఏండ్లుగా ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణలోనూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని త్వరితగతిన అమలుచేయాలి. జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సు పాసులు ఉచితంగా ఇవ్వాలి. అలాగే కొత్తగా మెట్రో పాసులను ఉచితంగా జారీచేయాలి. రాత్రిపూట మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు ఉచితంగా రవాణా వసతి కల్పించేలా ఆయా సంస్థలపై ఒత్తిడి తేవాలి. లైంగిక నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలి. ఇకపోతే కరోనాకు ముందు జర్నలిస్టులకు ఉన్న రైల్వే పాసుల సౌకర్యాన్ని యూనియన్ ప్రభుత్వం రద్దుచేసింది. దీన్ని పునరుద్ధరించేలా మోడీ సర్కార్పై ఒత్తిడి తేవాలి. ఈ సమస్యలను వెంటనే స్పందించి సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

సమస్యలు:1. అక్రిడిటేషన్ కార్డులను .2.ఒకే యూనియన్ నుంచి ప్రాతినిథ్యం వహించే వారిని అక్రిడిటేషన్ కమిటీల నుంచి తొలగించాలి.3.ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నరలిస్టుకూ హెల్త్కార్డులివ్వాలి. కంట్రిబూషన్ను ప్రభుత్వమే జర్నలిస్టుల తరపున చెల్లించాలి. 4. ఇండ్లస్థలాలు వెంటనే ఇవ్వాలి.5.రాత్రిపూట మహిళా జర్నలిస్టులకు పనిచేసే ప్రదేశం నుంచి ఇంటి వరకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలి. 6. ఉచితంగా ఆర్టీసీ, మెట్రో పాసులను అందజేయాలి.

7.రైల్వే పాసుల పునరుద్ధరణ కోసం మోడీ సర్కార్పై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి.

8.చిన్న పత్రికలకు పబ్లికేషన్ ఉమ్మడి జిల్లాలోని మండల కేంద్రాలలో అక్రిడేషన్ కార్డు ఇవ్వాలి.

9.చిన్న పత్రికలకు అడ్వర్టైజ్మెంట్స్ ఇవ్వాలి

10.పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలి కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి దాదే పోగు వెంకటన్న, అక్రిడేషన్ కమిటీ మెంబర్ కాశపోగు జాన్, జాతీయ కౌన్సిల్ నెంబర్లు రాఘవ గౌడ్, రంగముని,రామన్ గౌడ్,ఉపాధ్యక్షులు కే వీరన్న చారి, ఎం. రాముడు, కే.తిరుమల్, రామ్మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శాంతన్న,సుధాకర్, తిమ్మ గురు, విష్ణు,దేవేందర్ రెడ్డి, అనిల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి పిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా - ప్రజావాణి లో 112 ఫిర్యాదుల స్వీకరణ

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జూలై 13 :

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణిలో పంచాయతీరాజ్, మున్సిపల్, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, ప్రణాళిక శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 112 వినతులను అధికారులు స్వీకరించారు.

**జిల్లా అధికారులతో సమీక్ష...** ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి రెవెన్యూ, పంచాయతీరాజ్, కలెక్టరేట్ లో అధికంగా పెండింగో ఉన్నాయని అన్నారు. నెలకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, కలెక్టరేట్ విభాగాలు సహా అన్ని శాఖలు వారానికి ఒకసారి పెండింగ్ ఫిర్యాదులను సమీక్షించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో హెల్మెట్ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. మంగళవారం ఉదయం నుంచి హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై వచ్చే ఉద్యోగులను కలెక్టరేట్‌లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అన్ని శాఖాధిపతులు తమ పరిధిలోని ఉద్యోగులకు తెలియజేసి తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా వెనుకబడి ఉందని స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. ప్రతి జిల్లా అధికారి కనీసం రూ.250 సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యత్వం పొందాలని కోరారు. తమ శాఖలోని ఉద్యోగులందరినీ కూడా సభ్యత్వం పొందేలా ప్రోత్సహించాలని సూచించారు. ఎస్ఐఆర్-2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందుకున్న ప్రతి ఒక్కరూ వాటిని



గడువులోగా బి.ఎల్.ఓ లకు తిరిగి సమర్పించేలా గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వ్యవసాయ, విద్య, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల ఫీల్డ్ సిబ్బంది ఈ ప్రక్రియలో పూర్తిస్థాయిలో భాగస్వామ్యం కావాలని సూచించారు.

ఎం.పి.డి.ఓలు, తహసీల్దార్లు, ఎ.పి.ఓలు, ఎ.పి.ఎం లు తమ పరిధిలోని సిబ్బందిని సమన్వయం చేసి ప్రతి పోలింగ్ కేంద్రంలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ ,భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, డి.ఆర్.ఓ ఎ .నిర్మల, జడ్.పి.సి.ఈ.ఓ, ఇన్.ఛార్జ్ డి.పి.ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణతో పిల్లల ఆరోగ్యానికి భరోసా

### ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలి – జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




మహబూబ్నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 13:

జిల్లా కేంద్రం భగీరథ కాలనీ లో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల 2 లో సోమవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో నులిపురుగుల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి తగ్గడం, కడుపునొప్పి, బరువు పెరగకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. డీవార్మింగ్ కార్యక్రమం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు శారీరక, మానసిక వికాసానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఎ. శ్రీనివాసులు మాట్లాడుతూ, ఒకటి నుంచి రెండు సంవత్సరాల లోపు పిల్లలకు అర మాత్రను పొడిచేసి నీటిలో కలిపి ఇవ్వాలని, రెండు సంవత్సరాలు పైబడిన వారికి 400 మిల్లీగ్రాముల పూర్తి మాత్రను నమిలి మింగేలా ఇవ్వాలని తెలిపారు.

ఖాళీ కడుపుతో మాత్రలు వేయకుండా, ఆహారం తీసుకున్న తర్వాత మాత్రమే ఇవ్వాలని సూచించారు. పాఠశాలల్లో చదివే పిల్లలకు ఆయా విద్యాసంస్థల్లో, పాఠశాలలకు వెళ్లని చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశా కార్యకర్తల ద్వారా ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పిల్లల గోర్లను ఎప్పటికప్పుడు కత్తిరించడం, పరిశుభ్రమైన నీటిని మాత్రమే తాగించడం, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి వినియోగించడం, బహిరంగ మలవిసర్జనకు బదులుగా మరుగుదొడ్లను వినియోగించడం వంటి పరిశుభ్రత అలవాట్లు నులిపురుగుల నివారణకు దోహదపడతాయని వైద్యాధికారులు వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. ఎన్. శైలజ, డా. బి. శంకర్, డా. రాజు, డా. పులి విద్య, డా. నరేష్ చంద్ర, డా. ప్రవీణ్, మెడికల్ కళాశాలకు చెందిన డా. బిందు, మహాలక్ష్మి, హన్మంతు, నాగరాజు శెట్టి, భాస్కరాచారి, సుభాష్, సీతారామ్, ఆరోగ్య శాఖ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాకలం కథనానికి స్పందన

### తాడిచర్ల వెల్నెస్ కేంద్రంలో వైద్యధికారి తనిఖీ

### స్పందించిన జిల్లా వైద్యాధికారి

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



మల్హర్, జూలై 13 ప్రజాకలం ప్రతినిధి. న్యూట్రిషన్ పేరిట తాడిచర్లలో జరుగుతున్న నిలువు దోపిడీపై "ప్రజాకలం" దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తక్షణమే స్పందించింది. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు సోమవారం తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినయ్ భాస్కర్ సదరు వెల్నెస్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని నిర్వహణ తీరును, రికార్డులను పరిశీలించి అక్కడి నిర్వాహకులను నిలదీశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. కేవలం న్యూట్రిషన్ పౌడర్లతో ఎలాంటి వ్యాధులు నయం కావని స్పష్టం చేశారు. మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి, షుగర్, బీపీ, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తామంటూ అమాయక రోగుల నుండి డబ్బులు వసూలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేంద్రాలను సీజ్ చేస్తామన్నారు. ప్రజలు ఇలాంటి నకిలీ ప్రచారాలను నమ్మి మోసపోవద్దని, అనారోగ్య సమస్యలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులలోని అర్హులైన వైద్యులను సంప్రదించాలని ఆయన కోరారు.


ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
13 Jul 2026 - Page 1

నిలువు దోపిడీ చేస్తున్నా న్యూట్రిషన్ సెంటర్

- వ్యాధులు నయం మేము చేస్తామంటూ బురిడీ..
- రూ. 5వేలు వసూలు.. చైన్ సిస్టమ్ మోసాలు
- తాడిచర్ల కేంద్రంగా రేండు జిల్లాలో సాగుతున్న దందా...
- పట్టించుకోని అధికారులు.. లబోదిబోమంటున్న బాధితులు



# సునీల్ దాతృత్వం!

## - తెలంగాణ మోడల్ స్కూల్ లో స్టీల్ వాటర్ బాటిల్ పంపిణీ

ప్రజా కలం ప్రతినిధి జూలై 13 సంగారెడ్డి నాగలిగిద్ద మండలం మొర్గి తెలంగాణ మడల్ పాఠశాల కాలేజీలో అపెక్స్ ఆసుపత్రి సంగారెడ్డి సునీల్ కుమార్ సహకారంతో సోమవారం పాఠశాలలో చదువుకునే విద్యార్థులు విద్యార్థినిలకు స్టీల్ వాటర్ బాటిల్ లను నారాయణఖేడ్ డి.ఎస్.పి వెంకట్ రెడ్డి నాగలిగిద్ద ఎస్సై రామకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ మడల్ పాఠశాలలో వాటర్ బాటిల్ పంపిణీ చేయడం అభినందనీయమని ప్రతి విద్యార్థి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని చెప్పారు సునీల్ కుమార్ మాట్లాడుతూ నేను జన్మశీచ్చిన గ్రామంలో ని పాఠశాలలో స్టీల్ వాటర్ బాటిల్ పంపిణీ చేసే అవకాశం వచ్చినందుకు నేను గర్వపడుతున్నానని ప్రతి ఒక్కరు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని చెప్పారు అనంతరం మొర్గి గోడెగం షాపూర్ పాఠశాల కూడా వాటర్ బాటిల్ లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సువర్ణ సర్పంచ్ అన్నపూర్ణ మాజీ ఎంపిటిసి శంకరయ్య స్వామి గున్న సంగమేశ్వర్ గుప్త చిలప్చేడ్ ఎంఈఓ విట్టల్ తదితరులు పాల్గొన్నారు



## ఆర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించి

### - దరఖాస్తులు తీసుకున్న కలెక్టర్ గరీమ అగ్రవాల్.

### - 202 దరఖాస్తుల రాక.

రాజన్న సిరిసిల్ల, జూలై 13 ( ప్రజా కలం ప్రతినిధి) : ప్రజావాణిలో ప్రజల నుండి కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్వీకరించి పరిష్కారానికి ఆదేశించారు, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు, దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 202 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు పంపారు. ప్రజావాణి దరఖాస్తులు



ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో..

సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 14 దరఖాస్తులు వచ్చాయి. సిరిసిల్ల ప్రజావాణికి 10, వేములవాడ ప్రజావాణికి 04 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజావాణిలో జడ్పీ సీఈఓ వెంకట మాధవరావు రావు, డీఆర్ఓ జయశ్రీ, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వేదికపై గీతం ప్రతిభ..

### -అంతర్జాతీయ వేదికపై గీతం అధ్యాపకురాలి ప్రతిభ..

పటాన్ చేరు జులై 13 (ప్రజా కలం) ప్రతినిధి

గోవాలో జరిగిన 11వ అంతర్జాతీయ సమాచార, సమాచార ప్రసార సాంకేతిక సదస్సులో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కృత్రిమ మేధస్సు--యంత్ర అభ్యాస విభాగ అధ్యాపకురాలు ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ ఆహ్వానిత వక్తగా పాల్గొని ప్రసంగించారు. వస్తువుల అంతర్జాలం (ఐఓటీ) ద్వారా స్మార్ట్, సుస్థిర పరిష్కారాల అభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణల ప్రాధాన్యంపై ఆమె వివరించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొని ఆధునిక సాంకేతికతలు, పరిశోధనలపై చర్చించారు. సదస్సుకు ప్రతిమా గౌరీష్ ధోండ్, నితిన్ కుంకోలియంకర్, ప్రొఫెసర్ మిలన్ టూబా తదితర ప్రముఖులు హాజరయ్యారు. ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ పాల్గొనడం గీతం విశ్వవిద్యాలయం పరిశోధన, ఆవిష్కరణలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని చాటిందని యాజమాన్యం తెలిపింది..



# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాలతో ఇంటింటికీ ఎన్యుమరేషన్.. ప్రజలకు కాంగ్రెస్ అండ



వేములవాడ, జూలై 13 ( ప్రజా కలం ప్రతినిధి): ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను విజయవంతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎన్యుమరేషన్ దరఖాస్తుల భర్తీలో సహకారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ 8వ వార్డులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగుల విష్ణు ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డు ప్రజలను ప్రత్యక్షంగా కలిసి ఎన్యుమరేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు దరఖాస్తులను స్వయంగా నింపించి అవసరమైన సూచనలు అందించారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహాయ సహకారాలు అందించారు.

ఈ సందర్భంగా నాగుల విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్యుమరేషన్ ప్రక్రియలో ప్రతి అర్హుడు తప్పనిసరిగా పాల్గొని తన వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

### : జిల్లా అధ్యక్షుడు ఎల్గోయి ప్రభాకర్.

### పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ( టిడబ్ల్యూజేఎఫ్)- నిరంతరం పోరాటం కార్యదర్శి సీలంకోటి సురేందర్.

సంగారెడ్డి ప్రతినిధి జులై 13( ప్రజా కలం):

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని పద్మశాలి భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎల్గోయి ప్రభాకర్ మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, అక్రిడేషన్ కార్డుల మంజూరు, సంక్షేమ పథకాల అమలు కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని, మీడియా రంగంలో పనిచేస్తున్న పాత్రికేయుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లాలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.సమావేశంలో జర్నలిస్టుల సంఘటిత శక్తిని మరింత బలోపేతం చేయడం, సభ్యత్వ నమోదు, జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పాత్రికేయుల సంక్షేమ చర్యలపై విస్తృతంగా చర్చించారు.

కార్యదర్శి సీలంకోటి సురేందర్ మాట్లాడుతూ:

తెలంగాణలో పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ( టిడబ్ల్యూజేఎఫ్) నిరంతరం పోరాటం చేస్తోందని జిల్లా కార్యదర్శి సీలంకోటి సురేందర్ అన్నారు. జిల్లాలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జిల్లాలోని పాత్రికేయులను సంఘటితం చేసి వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలు, బీమా సౌకర్యాలు, ఆరోగ్య సేవలు, గృహ స్థలాల వంటి అంశాలపై ఫెడరేషన్ ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. జర్నలిస్టుల వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, మండల స్థాయి సమావేశాలు, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడతామని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం మీడియా రంగానికి సంబంధించిన పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

కలెక్టరేట్ ముందు నిరసన...

అర్హులైన పలువురు జర్నలిస్టులకు ఇప్పటికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు కాకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఎలాంటి వివక్ష లేకుండా అక్రిడేషన్ కార్డులు అందజేయాలని కోరారు.

అక్రిడేషన్ కార్డులు లేకపోవడంతో జర్నలిస్టులు విధుల నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా అక్రిడేషన్ కమిటీ సమావేశాన్ని వెంటనే నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ పాండు కు వినతిపత్రం అందజేసి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో కోశాధికారి సిహెచ్. నర్సింహారెడ్డి, జాతీయ కౌన్సిల్ మెంబర్ల ఏడు దొడ్ల సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పాండు, దండు ప్రభు, రాష్ట్ర జిల్లా కమిటీ నాయకులు, శరత్ బాబు, సభ్యులు మరియు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఫెడరేషన్ చేపట్టే కార్యక్రమాలకు అందరూ సహకరించాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

## వసంత నగర్ లో ఎస్ ఐ ఆర్ అవగాహన శిబిరాన్ని పర్యవేక్షించిన శ్రీనివాస బాబు

కూకట్ పల్లి, జులై 13, ప్రజా కలం ప్రతినిధి:

కూకట్ పల్లి నియోజకవర్గం వసంత్ నగర్ డివిజన్ లోని వసంత నగర్ సొసైటీ కార్యాలయం సమీపంలో సోమవారం ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియ పై సహాయ శిబిరాన్ని నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వసంత డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కిలారు శ్రీనివాస బాబు పర్యవేక్షించారు. ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ, ఓటరు వివరాల నమోదును శ్రీనివాస బాబుఎ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస బాబు మాట్లాడుతూ డివిజన్ లో నివసిస్తున్న ప్రతి ఒక్క వ్యక్తి ఓటు నమోదు కావాలని, అదే సమయంలో స్థానికంగా కొంతకాలంగా లేని వారిని గుర్తించి, వారి ఓట్లను తొలగించాలని, ఎట్టి పరిస్థితుల్లో దొంగ ఓట్లు నమోదు చేయరాదని బిఎల్ఓ లకు సూచించారు.హౌ ఓటర్ నమోదు ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# టీపీసీసీ సాంస్కృతిక సేన సిద్దిపేట జిల్లా కమిటీ ఎన్నిక.

దుబ్బాక ప్రజాకలం జూలై 13.

టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కళాప్రసాద్, ప్రధాన కార్యదర్శి బండకాడి గణేష్ ఆధ్వర్యంలో టీపీసీసీ సాంస్కృతిక సేన సిద్ధిపేట జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జిల్లా అధ్యక్షుడిగా కళాప్రసాద్ పుల్లూరు, ప్రధాన కార్యదర్శిగా బండకాడి గణేష్ (వెంకట్రావుపేట), ఉపాధ్యక్షులుగా సోము నరేష్ (ప్రజ్ఞాపూర్), కార్యదర్శిగా కళ్ళెం లక్ష్మణ్ యాదగిరి, కోశాధికారిగా బీమరి సీరియల్ (జగదేవ్‌పూర్), ప్రచార కార్యదర్శిగా డప్పు ప్రశాంత్ (అకారం), మహిళా కార్యదర్శులుగా పెద్ద మ్యాతరి రజిత (పెద్ద చీకోడ్), గంధమల్ల శ్యామల (గజ్వేల్)లను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా బెజ్జంకి తిరుపతి, వినోద్ కుమార్, అశోక్ స్వామి, టి.రాజులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సాంస్కృతిక సేన కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఆట, పాట, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు, డీసీసీ అధ్యక్షులు తూముకుంట ఆంక్షారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆరుద్ర విశేషం..గుట్టపై భక్తుల సందడి..

### -ఆరుద్ర విశేషం..బీరంగూడ గుట్టకు భక్తుల పోటు.

పటాన్‌చెరు, జూలై 13 (ప్రజా కులం) ప్రతినిధి

ఆరుద్ర నక్షత్రం,సోమవారం కలయికతో బీరంగూడ గుట్టపై భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం సోమవారం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. పవిత్రమైన ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు ప్రహ్లాద్ మాట్లాడుతూ,తెల్లవారుజాము నుంచే మహారుద్రాభిషేకం నిర్వహించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఆలయ



చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనంతగా భక్తులు తరలివచ్చారని,వినోద్ కుమార్ కుటుంబ సభ్యులు అన్నదానానికి రూ.1 లక్ష విరాళం అందించారని చెప్పారు. ఈ సందర్భంగా పట్నం సునీత మహేందర్ రెడ్డి,కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి, దేవాదాయ శాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు..

## 15వ వార్డులో డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి పర్యటన.. ఓటరు నమోదుపై అవగాహన

గజ్వేల్:13 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి సోమవారం గజ్వేల్ మున్సిపాలిటీ 15వ వార్డులో పర్యటించారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు సవరణ) కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఓటరు నమోదు హెల్ప్‌డెస్క్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో పాల్గొని తమ ఓటు వివరాలను నమోదు చేసుకోవడం లేదా సరిచేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.అలాగే బీఎల్ఓలకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఓటరు నమోదు కార్యక్రమానికి స్వచ్ఛందంగా సహకరించిన సామాజిక కార్యకర్త సాధాక్ పాషా,బీఎల్ఓ బసడి మమత,నాయకులు కృపానందం, కనకస్వామిలను శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్ ఖాన్, కౌన్సిలర్లు నక్క సంతోషి--రాములు గౌడ్,గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండల్ రెడ్డి,సీనియర్ నాయకులు వహీద్ ఖాన్,జోగిని లక్ష్మణ్, మహంకాళి చంద్రం,కృపానందం,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రతి విద్యార్థికి,నూలి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

### -మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు -మండల వైద్య అధికారి శ్రీవాణి

### -మండల వ్యాప్తంగా 8536 మంది పిల్లలకు ఆల్బెండజోల్ పంపిణీ



భూదాన్ పోచంపల్లి జులై 13 (ప్రజా కాలం) నూలి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వైద్య అధికారి శ్రీవాణి అన్నారు. సోమవారం రోజు పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ బాలురు,బాలికల ఉన్నత పాఠశాలలో నులి పురుగుల నివారణ కార్యక్రమానిక ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

రెండు సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలకి అందరికీ నులిపురుగుల మందుల నివారణకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని అన్నారు. ఈ ఆల్బెండజోల్ మాత్ర వేసు కున్నట్లయితే ఎవరికైనా నులిపురుగులు ఉన్నట్లయితే అవి నశించి విద్యార్థులు యొక్క ఆరోగ్యం మంచిగా ఉండి రక్తహీనత నుండి రక్షించబడతారని తెలిపారు,మండల వ్యాప్తంగా ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల ఎంఎంఎల్ హెచ్ పి లు వారి కేంద్రాల పరిధిలో పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా 8536 మంది పిల్లలకు పంపిణీ చేశారు. సోమవారం ఈరోజు పాఠశాలకు రాని విద్యార్థిని విద్యార్థులకు ఈనెల 20వ తారీఖున మరొకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తాము అని మండల వైద్యాధికారి శ్రీవాణి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్ బాబు, పద్మావతి, జానకి,ఆశా కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు గడువులోపు పూర్తి చేయాలి

### సీజనల్ వ్యాధుల నివారణ, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి:13 జూలై 2026(ప్రజా కలం ప్రతినిధి):

సిద్దిపేట జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ప్రగతి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ఆమె విస్తృతంగా సమీక్షించారు.సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించి వారానికి కనీసం ఒకసారి ఫాగింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్ డ్రైవ్‌ను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు స్పెషల్ ఆఫీసర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

విద్యార్థులకు హాస్టళ్లు, పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం అందించాలని, మెనూ ప్రకారం భోజనం అందించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ అందేలా ప్రత్యేక నమోదు కార్యక్రమం చేపట్టాలని, యూనిఫాంలను సకాలంలో పంపిణీ చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు.వనమహోత్సవం లక్ష్యాలను ప్రతి శాఖ తప్పనిసరిగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి ఒక మొక్కను నాటేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. అలాగే ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ప్రకృతి పరిరక్షణతో పాటు పోషకాహారంపై అవగాహన పెంపొందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్రీ లెఫ్ట్ టర్న్ అండర్‌పాస్‌ను పరిశీలించిన సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్, సన్‌ప్రీత్ సింగ్



శేర్లింగంపల్లి
ప్రజా కలం న్యూస్ ప్రతినిధి: జులై 13

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కొనసాగుతున్న మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్రీ లెఫ్ట్ టర్న్ అండర్‌పాస్‌ను సందర్శించారు. అధికారులు స్థలాన్ని పరిశీలించి, పనులు పూర్తయిన తర్వాత ట్రాఫిక్ సాఫీగా నడిచేలా ఉండేందుకు విలువైన సూచనలు అందించారు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, వాటి కారణంగా ట్రాఫిక్‌పై పడుతున్న ప్రభావాన్ని సమీక్షించి, ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్‌ను సురక్షితంగా, అంతరాయం లేకుండా మళ్లించేందుకు అవసరమైన ప్రాంతాల్లో బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే డైవర్షన్ అమలుకు ముందు ట్రయల్ రన్ నిర్వహించి, లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ప్రజలకు ఇబ్బందులు తగ్గేలా ట్రాఫిక్ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ పోలీసులు, నిర్మాణ సంస్థలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. ఈ పరిశీలనలో డీసీపీ ట్రాఫిక్-I ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ ట్రాఫిక్-I టి. హనుమత్ రావు, ట్రాఫిక్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనం అందరు జర్నలిస్టులకే చెందాలి

### - అన్ని జర్నలిస్టు సంఘాల సభ్యులకు సమాన అవకాశాలు కల్పించాలి.
### - ఆర్డీవో, ఎంపీడీవోలకు టీయూడబ్ల్యూజే హెచ్-143 వినతి.



వేములవాడ, జూలై 13 ( ప్రజా కలం ప్రతినిధి) : వేములవాడ పట్టణంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో, ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనం ఏ ఒక్క సంఘానికి పరిమితం కాకుండా వేములవాడ ప్రాంతంలోని జర్నలిస్టులందరి ప్రయోజనార్థం ఏర్పాటు చేయబడిందని, అందువల్ల అన్ని జర్నలిస్టు సంఘాల సభ్యులకు సమాన అవకాశాలు కల్పిస్తూ భవనాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలి ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కుమారి, ఎంపీడీవో బింగి కీర్తనలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తిగా ఉన్న ప్రెస్ క్లబ్ భవనం వేములవాడ ప్రాంతంలోని జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన కార్యక్రమాలు, సమావేశాల నిర్వహణ కోసం నిర్మించబడిందని తెలిపారు. కాబట్టి ఏ ఒక్క సంఘానికో లేదా కొంతమంది వ్యక్తులకో పరిమితం చేయకుండా, అన్ని జర్నలిస్టు సంఘాల సభ్యులు సమాన హక్కులతో భవనాన్ని వినియోగించుకునే విధంగా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని స్వీకరించిన ఆర్డీవో కుమారి, ఎంపీడీవో కీర్తన ఈ అంశంపై సమగ్ర విచారణ నిర్వహించి, ప్రభుత్వ నిబంధనలు, రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారులు జితేందర్ రావు,ఉపాధ్యక్షులు సి హెచ్ దేవరాజు, విష్ణు,ఫహాద్ పాషా లు ఉన్నారు.

# ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని సన్మానించిన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

వేములవాడ, జూలై 13 ట ప్రజా కలం ప్రతినిధిఃః : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) హెచ్-143 వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా ఆధ్వర్యంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు కొండ దేవయ్యను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్నూరు కాపు సత్రం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండ దేవయ్య ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీతో పాటు నూతన కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల సేవలు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ప్రజలకు వాస్తవాలను చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని, వేములవాడ ప్రెస్‌క్లబ్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవ పరిరక్షణకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ



కార్యక్రమంలో జిల్లా క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ సయ్యద్ రసూల్, ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారులు కొత్వాల్ శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి కముటాల విజయ్, ప్రెస్ క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జింక శ్రీధర్, దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు, సంటి రాజేందర్,షబ్బీర్ నవీన్, ఆసీమ్,లు పాల్గొన్నారు.

# మహిళలు 'పంచ సూత్రాలు' పాటిస్తూ ఆర్థిక అభివృద్ధి సాధించాలి: వేల్పూర్ ఏపీఎం మాణిక్యం



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 13:

ప్రతి మహిళా 'పంచ సూత్రాలను' పాటిస్తూ ఆర్థికంగా అడుగులు ముందుకు వేయాలని వేల్పూర్ మండల వెలుగు ఏపీఎం మాణిక్యం పిలుపునిచ్చారు. ఆర్థిక అక్షరాస్యతతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా డిజిటల్ లావాదేవీలు , తెలివిగా పొదుపు చేయడం, బీమా మరియు పెన్షన్ల ప్రాధాన్యత, అనవసర ఖర్చులను తగ్గించుకోవడం వంటి ముఖ్యమైన విషయాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా, వేల్పూర్ మహిళా సమాఖ్యకు చెందిన మాధురి, లావణ్య, సరిత అనే ముగ్గురు మహిళలు ఎస్‌బీఐ రీసెట్ కార్యాలయంలో ఎఫ్ఎల్‌సీఆర్‌పీ ట్రైనింగ్‌కు ఎంపికయ్యారు. ఈ ముగ్గురు మహిళలు తమ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకొని రావడం పట్ల ఏపీఎం మాణిక్యం హర్షం వ్యక్తం చేశారు.

ఈ శిక్షణా కాలంలో వారు పలు కీలకమైన విషయాలపై పూర్తి అవగాహన పెంచుకున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా సాక్ష్యం యాప్ ద్వారా బేస్ లైన్ సర్వే ఎలా నిర్వహించాలి, మహిళా పారిశ్రామికవేత్తల కోసం కేంద్ర ప్రభుత్వం అందించే 'ఉద్యమ్ సర్టిఫికెట్' ఆన్‌లైన్ ద్వారా ఎలా పొందాలో నేర్చుకున్నారు. వీటితో పాటు, మహిళల జీవనోపాధిని మెరుగుపరిచే ఐలా లోన్ ఎవరికి వర్తిస్తుంది, దానిని ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై శిక్షణ పొందినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు వెన్న మురళీ, సాయన్న, మరియు కంప్యూటర్ ఆపరేటర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ.. ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం





వేములవాడ, జూలై 13 ట ప్రజా కలం ప్రతినిధఃః : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం నులిపురుగుల నివారణ అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విద్యార్థులను నులిపురుగుల బారిన పడకుండా కాపాడేందుకు ప్రతి సంవత్సరం రెండు దఫాలుగా అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ఇటీవలే పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని, అలాగే 14 ఏళ్ల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను కూడా ప్రభుత్వం అందజేసిందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ప్రజా ప్రభుత్వంలో గురుకుల పాఠశాలల్లో డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచడంతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

రానున్న రోజుల్లో వేములవాడ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. హైదరాబాద్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, ఇప్పటికే ఆరుట్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించామని చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు స్వగ్రామ వాతావరణానికి దూరం కాకుండా నాణ్యమైన విద్య అందించడమే ఈ పాఠశాలల లక్ష్యమని వివరించారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆది శ్రీనివాస్ సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, విద్యాశాఖ, వైద్యారోగ్య శాఖ అధికారులు, గురుకుల పాఠశాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్త ఉచిత బస్ పాసులు ఇవ్వాలి: టిడబ్ల్యూజేఎఫ్

మేడ్చల్ మల్కాజిగిరి జూలై 13 (ప్రజా కలం ప్రతినిధి)

వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ రాష్ట్ర వ్యాప్త ఉచిత బస్ పాసులు ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కూకట్ పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయ ఓఎస్ కు ఆ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్న జర్నలిస్టులకు ఉచిత బస్సు పాసులు ఇస్తే నష్టం లేదని తెలిపారు. ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ చాలా ఏళ్ళుగా మాయొక్క జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీపై ప్రయాణ సదుపాయం అమలు చేయడం మంచిదే కానీ గత కొంతకాలంగా 1/3 చార్జీలు అంటూనే దాదాపు 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఎలాంటి వేతన సౌకర్యం లేని జర్నలిస్టులకు మోయలేని భారమవుతుందని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి వార్తలు సేకరిస్తున్న జర్నలిస్టులకు ఈచార్జీలు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రాష్ట్రంలో అనేక మంది



జర్నలిస్టులు సరైన వేతనాలు లేకపోయినప్పటికి జర్నలిజం వృత్తినే నమ్ముకొని సమాజ అభివృద్ధి కోసం పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఉచితంగా బస్సు పాసులు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టులు స్థానికంగా ప్రభుత్వానికి, ప్రజలకు, ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ కొద్దిమందిగా ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరంగా ఉందన్నారు. జర్నలిస్టులకు అన్ని అర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు నాగార్జున, షబ్బీర్, చందు, నాగరాజు, రాజులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధమైన సౌకర్యాలు వెంటనే అమలు చేయాలి:సిఐటియు

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) మేడ్చల్-- మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ....




మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని అన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్టబద్ధంగా కల్పించాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, సెలవులు, భద్రతా పరికరాలు తదితర అన్ని సౌకర్యాలను ప్రతి యాజమాన్యం తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేకుండా పనిచేస్తున్న కార్మికులను వెంటనే ఆయా పథకాల పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులు కనీస వేతనాలు, చట్టబద్ధమైన హక్కుల కోసం ప్రశ్నించినప్పుడు యాజమాన్యాలు కార్మిక సంఘాల నాయకులను, కార్మికులను బెదిరించడం, వేధించడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడం వంటి చర్యలను ప్రభుత్వం వెంటనే అరికట్టాలన్నారు. కార్మికులకు రాజ్యాంగం కల్పించిన సంఘటిత హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 6ను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో ఎలాంటి మినహాయింపులు లేకుండా కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కార్మిక శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సిఐటియు సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ వెంకటరామయ్య, సిఐటియు మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వెంకట్రాజ్యం, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి లింగస్వామి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, సిఐటియు నాయకులు నాగభూషణ్, స్వామి, భాస్కర్ లు పాల్గొన్నారు.



## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) హెల్ప్ డిస్క్ కార్యక్రమాన్ని పరిశీలించిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 277వ డివిజన్ మహాదేవపురం పరిధి దేవేందర్ నగర్ గాజులరామారం సర్కిల్-కాజు-నా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) హెల్ప్ డిస్క్ కార్యక్రమాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా, నిష్పాక్షికంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని అధికారులను కోరారు. ప్రజలు కూడా బీఎల్ఓలు అందజేసే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా పూర్తి చేసి సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ప్రతి అర్హులైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం సామాజిక బాధ్యత అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్ధనోళ్ళ సంజీవ్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ గణేష్, ఐ.ఎన్.టి.యూ.సి నాయకులూ దేగుల సతీష్ బాబు, లలిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడలు అవసరం

హైద్రాబాద్ జూలై 13(ప్రజాకలం న్యూస్)

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.చిరంజీవి అన్నారు.కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి అవిఘ్న వెంకట్రెడ్డి కరాటే ప్రదర్శన ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అందుకున్న సందర్భంగా సోమవారం కళాశాలలో ప్రిన్సిపల్,లెక్చరర్స్ అతన్ని అభినందించి సత్కరించారు. మానసిక,శారీరక ఆరోగ్యాన్నిచ్చే ఆటలను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు,ఉద్యోగ ఉపాధి అవకాశాలు దొరుకుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జిఎస్. గోపాల్ రెడ్డి, కళాశాల లెక్చరర్స్ రాంమోహన్,అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి మహబూబ్నగర్ జిల్లాల ఉద్యమకారుల పరిష్కరించాలి:ఎం.అశోక్ రెడ్డి

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి మహబూబ్నగర్ జిల్లాల ఉద్యమకారుల పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమ నాయకులు యం.అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి మహబూబ్నగర్ జిల్లాల ఉద్యమకారుల సమావేశం కేకే కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు యం.అశోక్ రెడ్డి, సంపత్ మాధవరెడ్డి, సూదగాని వెంకటేష్ గౌడ్, మల్లేష్, మారం లక్ష్మారెడ్డి తదితర నాయకులు పాల్గొని ఉద్యమకారులను ఎట్ల గుర్తించాలో సూచనలు సలహాలు ఇచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఉద్యమకారుల లిస్టు, ఉద్యమకారుల చరిత్ర బుక్ ను ఇవ్వడం జరిగింది. ఈసమావేశంలో తెలంగాణ ఉద్యమ నాయకులు అశోక్ రెడ్డి మాట్లాడుతూ... ఈ క్రింది సూచనలు తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించడం అనేది కేవలం ఒక ప్రక్రియ మాత్రమే కాదు, వారి త్యాగాలకు ఇచ్చే గౌరవం అన్నారు.

ప్రభుత్వం ఈ క్రింది అంశాల ఆధారంగా ఉద్యమకారులను గుర్తిస్తే పారదర్శకత, నిష్పాక్షికత ఉండే అవకాశం ఉంటుంది. 1. అధికారిక రికార్డుల పరిశీలన...

కేసుల వివరాలు: ఉద్యమ సమయంలో (ముఖ్యంగా 2001 నుండి 2014 మధ్య) నమోదైన పోలీసు కేసులు, ఎఫ్.ఐ.ఆర్ (FIR) కాపీలను ప్రాథమిక ఆధారంగా తీసుకోవచ్చు. జైలు శిక్ష: ఆందోళనల్లో పాల్గొని జైలుకు వెళ్లిన వారు, రిమాండ్‌లో ఉన్నవారి రిజిస్టర్లను పరిశీలించడం. 2. క్షేత్రస్థాయి కమిటీల ఏర్పాటు జిల్లా/మండల కమిటీలు: కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, స్థానిక స్థాయిలో అప్పటి ఉద్యమ సంఘాల నాయకులు, మేధావులతో కూడిన కమిటీలను వేసి నిజమైన ఉద్యమకారులను ధృవీకరించడం. సాక్ష్యాల సేకరణ: పత్రికా ప్రకటనలు, ఫోటోలు, వీడియో ఫుటేజీలు లేదా అప్పటి ఉద్యమ జెఎసి (జేఏసీ) ధృవీకరణ పత్రాలను పరిగణనలోకి తీసుకోవాలి.

3 వర్గీకరణ ద్వారా ప్రాధాన్యత ఉద్యమకారులను వారి పాత్రను బట్టి వర్గీకరించడం వల్ల సహాయం అందించడం సులభమవుతుంది.

అమరవీరుల కుటుంబాలు: వీరికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

గాయపడిన వారు: లాఠీచార్జీలు లేదా ఇతర ఘటనల్లో శారీరకంగా దెబ్బతిన్న వారు. విద్యార్థి ఉద్యమకారులు చదువు వదిలి ఉద్యమంలోకి దూకిన వారి ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడం 4. పారదర్శకమైన డిజిటల్ పోర్టల్

ఆన్‌లైన్ దరఖాస్తు: అర్హులైన వారు తమ దగ్గర ఉన్న ఆధారాలతో దరఖాస్తు చేసుకునేలా ఒక పోర్టల్ ఉండాలి.

ప్రజా ఫిర్యాదులు: అనర్హులు జాబితాలోకి రాకుండా ఉండేందుకు, ఎంపికైన వారి పేర్లను గ్రామ సభల్లో లేదా వెబ్‌సైట్‌లో ఉంచి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించడం.

గుర్తింపు పొందిన వారికి అందించాల్సిన గౌరవం:

గుర్తింపు కార్డులు: రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందేలా ప్రత్యేక ఉద్యమకారిణి/ఉద్యమకారుడు' ఐడి కార్డులు. సంక్షేమ పథకాలు: పెన్షన్, ఉచిత వైద్య సౌకర్యం, బస్సు పాస్‌లు లేదా పిల్లల విద్యలో రాయితీలు కల్పించడం. నిజమైన ఉద్యమకారులకు న్యాయం జరిగినప్పుడే తెలంగాణ ఆకాంక్షలకు పూర్తి గౌరవం దక్కుతుందని చెప్పారు.



## భువనగిరి పార్లమెంట్ అభివృద్ధి చామల లక్ష్యం
### ఉప్పునూతల వెంకటేష్ యాదవ్

భుదాన్ పోచంపల్లి జులై 13 ( ప్రజా కలం ) అభివృద్ధి బాటకు దిక్సూచి కాంగ్రెస్ పార్టీ, ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ప్రజలకు అండగా నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పోచంపల్లి మండల నూతన అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా సోమవారం ఉదయం ఆయన నివాసంలో కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పార్టీలకు అతీతంగా నిరుపేదల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేల సమకూర్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ జిల్లాఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి,జిల్లా సీనియర్ నాయకులు పాక మల్లేష్ యాదవ్, సింగిల్విండో వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, వంకమామిడి సర్పంచ్ మచ్చ శ్రీనివాస్, RTI రాష్ట్ర అధ్యక్షులు ఏర్పుల శ్రీనివాస్, భువనగిరి కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుత్తి బాల శంకర్,శాపాక శంకర్ పాల్గొన్నారు.

## ల్యాండ్ పూలింగ్ చెల్లింపులో ఎకరానికి 1200 గజాలు ఇవ్వాలని కోరిన రైతులు

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మండలం పరిధి సర్వేనెంబర్ 453, 454 భూములపై సోమవారం దుండిగల్ మున్సిపల్ వార్డు కార్యాలయంలో రైతులతో రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి అతిథిగా మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రసాద్, మండల తాసిల్దార్ రాజేశ్వర్ రెడ్డి రైతులతో భూములపై రైతుల అభిప్రాయ సేకరణ చేశారు. గతంలో గ్రామ వ్యవసాయ సాగు కోసం ప్రభుత్వం భూములను 300 రైతులకు పైగా పట్టాలివ్వడం జరిగింది.

చాలామంది రైతులు వ్యవసాయ సాగు చేసేందుకు నీరు లేకపోవడంతో సాగు చేయడంలేదు. గత రెండు సంవత్సరాలకు పైగా ఈ భూములను ప్రభుత్వమే తిరిగి తీసుకోనుంది. ప్రభుత్వ నిర్ణయం గతంలో కలెక్టర్ రైతులను ఒప్పించి తీసుకోవాలన్న అభిప్రాయంతో గత ప్రభుత్వంతో పాటు ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం సైతం గత నెల ప్రభుత్వ అధికారులతో గ్రామ సభ నిర్వహించి రైతుల అభిప్రాయాలను తీసుకున్న విషయం అందరికీ తెలిసిందే. గత గ్రామ సభలో రైతులకు ఎకరాకు 500గజాల స్థలం ఇస్తామన్న ప్రభుత్వ ప్రతిపాదనకు రైతులు ఏకీభవించలేరు. దీంతో తదుపరి గ్రామసభ నిర్వహిస్తామని అధికారులు తెలపడంతో తిరిగి మరల గ్రామసభ నిర్వహించిన నేపథ్యంలో ఈసమావేశంలో రైతులు తమ అభిప్రాయం ఆర్డిఓ, మండల తాసిల్దార్ కు తెలియజేస్తూ భూ నిర్వాసితులకు ఎకరాకు తప్పనిసరిగా 1200గజాల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దుండిగల్ గ్రామ పరిధిలో ఎటువంటి మౌలిక వసతులు లేవని ఫంక్షన్ హాల్, వైకుంఠధామం, ఆటస్థలాలు వంటి సౌకర్యాలు ఇక్కడ వసతులు కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు చిన్నంగి వెంకటేశం, టిపిసిసి ఎగ్జిక్యూటివ్ క్యాంపెనింగ్ సభ్యులు లబ్దిపీర్ల నర్సింగ్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంరెడ్డి, దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, మాజీ కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, కావలి శశికుమార్, ఆకుల విజయసాయి, భానుగౌడ్, రాజుకుమార్ ముదిరాజ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## 296 డివిజన్‌లో దెబ్బతిన్న విద్యుత్ స్థంభాల తొలగింపు, కొత్త స్థంభాల ఏర్పాటుకు ఎడిఈ కి వినతిపత్రం అందించిన దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 296 డివిజన్ పరిధిలోని దుండిగల్ గ్రామం, నాగులూరు గ్రామం, దుండిగల్ తండా-01, దుండిగల్ తండా-02, గగిల్లాపూర్ గ్రామం, చర్చ్ గగిల్లాపూర్ గ్రామం, 214 కాలనీ, శంభీపూర్ గ్రామం, మహేశ్వరం గ్రామం, కేవీఆర్ కాలనీ ప్రాంతాల్లో దెబ్బతిన్న, వంగిన రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించి, అవసరమైన చోట కొత్త విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ వీరబత్తిని నరేందర్ గౌడ్, దుండిగల్ మాజీ సర్పంచ్ కావాలి గణేష్, దొంతి మహేష్ ముదిరాజ్, దత్తు రాజ్ యాదవ్ టిఎస్ఎస్ పిడిసిఎల్ /ట్రాన్స్ కో జీడీమెట్ల కార్యాలయంలో ఎడిఈ కి వినతిపత్రం అందజేశారు.



ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... పై ప్రాంతాల్లో అనేక విద్యుత్ స్థంభాలు వంగి ఉండడం, దెబ్బతినడం మరియు కొన్ని చోట్ల రోడ్డుకు అడ్డంగా ఉండడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు, పాదచారులకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గాలివానలు, వర్షాలు లేదా ఇతర సహజ కారణాల వల్ల దెబ్బతిన్న విద్యుత్ స్థంభాలు కూలిపోయే ప్రమాదం ఉన్నందున, వాటి కారణంగా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్థంభాలను సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించి, వంగిన, దెబ్బతిన్న స్థంభాలను తొలగించి, అవసరమైన చోట కొత్త విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించి, ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా సురక్షితమైన ప్రదేశాల్లో పునఃస్థాపన చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు ఎడిఈ ని కోరారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కార్యాలయ భవనానికి స్థలం కేటాయించాలని మండల తాహసిల్దార్ పి. శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేసిన సిపిఐ మండల నాయకులు

బొమ్మలరామారం (ప్రజా కలం): జూలై 13

బొమ్మలరామారం మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కార్యాలయానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అన్నమైన వెంకటేశం సోమవారం రోజున బొమ్మలరామారం మండల తహసిల్దార్ పి శ్రీనివాసరావు కి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి అన్నేమైన వెంకటేశం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ప్రభుత్వమే ఇల్లు కట్టించాలని అని అన్నారు ఇంటి స్థలం లేని నిరుపేదలకు ఇండ్లు కట్టుకోవడానికి ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పల్లపు మల్లేష్, కైరం కొండ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు



# చోరీ కేసును 48 గంటల్లోనే చేదించిన పోలీసులు

### - నిందితుడి వద్ద నుంచి 12 గ్రాముల బంగారు గుండ్ల తాడు, 40 గ్రాముల వెండి పట్టే కడెం స్వాధీనం



కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 13 ప్రజా కలం : ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధి లోని 11వ వార్డులో గత రెండు రోజుల క్రితం జరిగిన ఓ చోరీ కేసును స్థానిక పోలీసులు కేవలం 48 గంటల్లోనే చేదించారు. ఈ మేరకు సోమవారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను సిఐ రాజారెడ్డి వెల్లడించారు. 11వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు లింగారెడ్డి పేట గ్రామానికి చెందిన తలారి సంగయ్య తల్లి దుర్గవ్వ, కుక్కల పోశవ్వ, పుర్ర కాశవ్వ ఇంటి దగ్గర మాట్లాడుకుంటూ ఉన్నారు. అంతలోనే ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పుర్ర కాశవ్వతో మీ కొడుకు బెయిల్ కొరకు నన్ను పంపాడని, మీ ఇంట్లో బీరువాలో ఉన్న డబ్బులు ఇవ్వమన్నాడు అని చెప్పాడు. అనంతరం కాశవ్వ ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో డబ్బులు కనిపించలేదు. అనంతరం సదరు వ్యక్తి తిరిగివచ్చి ఇంట్లో మాట్లాడుకుంటూ కూర్చున్న మహిళలతో కల్లు తాగుతారా అని అడిగి పక్కనే ఉన్న పుర్ర పర్వయ్యతో కల్లు తెప్పించాడు. కల్లు తాగిన తర్వాత తలారి దుర్గవ్వ వద్ద నుండి బలవంతంగా మెడ వంచి ఆమె భుజాల మీద కూర్చుని బంగారు గుండ్ల తాడును తెంచుకొని అక్కడే ఉన్న కుక్కల పోషవ్వ చేతికి ఉన్న వెండి పట్టే కడియం గుంజుకొని పరారయ్యాడు. ఈ విషయమై దుర్గవ్వ కుమారుడు సంగయ్య స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు స్థానిక డిఎస్పి శ్రీనివాసరావు సూచన మేరకు దర్యాప్తు అధికారి సీఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది నిందితుడైన లింగంపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన నీరుడి సాయిలు ను గుర్తించి 48 గంటల్లో అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి సుమారు లక్ష రూపాయల విలువ గల 12 గ్రాముల బంగారు గుండ్ల తాడు, 40 గ్రాముల వెండి పట్టే కడెం ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్ కోసం కోర్టుకు తీసుకు వెళ్లారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన సిఐ రాజారెడ్డి, ఎస్ఐ రాజు, పోలీసు సిబ్బంది శ్యామ్, ఇద్రిస్, సంజీవ్, వసింధర్, విజయ్ లను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ప్రత్యేకంగా అభినందించారు.



## మైనారిటీ బాయ్స్ రెసిడెన్షియల్ కాలేజ్ ను ఎల్లారెడ్డిలోనే కొనసాగించాలి

### - ఆర్డీవోకు వినతిపత్రం అందించిన ముస్లిం వెల్ఫేర్ కమిటీ సభ్యులు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 13 ప్రజా కలం : ఎల్లారెడ్డి పట్టణానికి మంజూరైన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాయ్స్ జూనియర్ కాలేజ్ ను ఇక్కడే కొనసాగించా లని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ముస్లిం వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఆర్డిఓ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ఆరేళ్లుగా ఎల్లారెడ్డిలో విజయవంతంగా కొనసాగిన మైనారిటీ జూనియర్ కళాశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి లింగంపేటకు తరలించడం సరికాదని పేర్కొన్నారు. దీనివల్ల ఎందరో విద్యార్థులు చదువు ను మధ్యలో ఆపే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు పునరా లోచించి తక్షణమే ఎల్లారెడ్డి పట్టణానికి మైనారిటీ బాయ్స్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజావాణి కి ఒక ఫిర్యాదు

### - తహసిల్దార్ ప్రేమ్ కుమార్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 13 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండల కేంద్రంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒక ఫిర్యాదు వచ్చినట్లు తహసిల్దార్ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఆ ఫిర్యాదు తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కు సంబంధించినదిగా ఆయన తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన ముత్యాల సురేందర్రావు కు తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ హైదరాబాద్ లోని వివేకానంద ఓవర్సీస్ (దూరవిద్య) ద్వారా 20 లక్షల రూపాయలు ముత్యాల సురేందర్రావు కుమారుడు వెంకట నరసింహారావు కి సాంక్షన్ అయి మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. అయినా ఇంకా 20 లక్షల రూపాయల డబ్బులు చేతికి రాకపోవడంతో రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదు చేసిన అనంతరం స్థానిక తహసిల్ కార్యాలయంలోనీ ప్రజావాణి కార్యక్రమం కు చేరుకుని స్థానిక తహసీల్దార్ ప్రేమ్ కుమార్ కు ఫిర్యాదును అందజేశారు.

# ఆర్మూర్ మండలం మగ్గిడిలో దళిత మహిళ భూమి కబ్జా

### న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం!

### - ప్రభుత్వం ఇచ్చిన భూమిని అక్రమంగా ఆక్రమించిన దుండగులు

### - బాధిత మహిళ,ఆమె కూతురిపై కులం పేరుతో బూతులు తిడుతూ దాడి

### -పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని ఆవేదన

### - బాధితురాలికి మద్దతుగా నిలిచిన అంబేడ్కర్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు




నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) జూలై 13: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామంలో దళిత (ఎస్సీ మాల) కుటుంబానికి చెందిన భూమిని కొందరు అక్రమార్కులు కబ్జా చేయడమే కాకుండా, బాధితులపై దౌర్జన్యానికి దిగుతున్న సంఘటన తీవ్ర కలకలం రేపుతోంది. తమ భూమిని కాపాడుకోలేకపోతే ప్రాణాలు తీసుకుంటానని బాధిత మహిళ దమ్మడి ఎర్రవ్వ పత్రికా ముఖంగా కన్నీటి పర్యంతమై ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి కథనం ప్రకారం...గత 2005 సంవత్సరంలో జోగిని వ్యవస్థ రద్దు కావడానికి గాను ప్రభుత్వం మగ్గిడి గ్రామంలోని సర్వే నంబర్ 360/1/3 నందు దమ్మడి ఎర్రవ్వకు 1 ఎకరం 18 గుంటల భూమిని కేటాయించింది. అయితే, ప్రభుత్వం తనకు ఇచ్చిన భూమి తనకు దక్కకుండా గ్రామానికి చెందిన మామిడి చిన్న గంగారాం, మామిడి గంగాధర్, మగ్గిడి పోశెట్టి, ఔట్ల చిన్న గంగారాం, రామాయెుల్ల భూమేష్, నూతిపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తులు అక్రమంగా ఆ భూమిలోకి చొరబడ్డారు. అక్కడ దౌర్జన్యంగా దోబీ ఘాట్ కట్టడమే కాకుండా, రిగ్గు వేసి భూమిని కబ్జా చేశారు. తాము కష్టపడి సంపాదించుకున్న మరియు ప్రభుత్వం ఇచ్చిన భూమిలోకి వెళ్తే... "భూమిలోకి వస్తే పాతిపెడతాం" అంటూ కులం పేరుతో బూతులు తిడుతూ ఎర్రవ్వపై, ఆమె కూతురిపై సదరు వ్యక్తులు భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ దౌర్జన్యంపై ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో, జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మార్వో కు, మరియు సంబంధిత అధికారులందరికీ రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదని బాధిత కుటుంబం వాపోయింది. అధికారులు స్పందించి తనకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని తనకు దక్కేలా చేయకపోతే తాను చనిపోతాను అని ఎర్రవ్వ తీవ్ర నిర్ణయాన్ని ప్రకటించారు. బాధితురాలికి దళిత సంఘాల సంపూర్ణ మద్దతు:బాధిత దళిత కుటుంబానికి జరిగిన అన్యాయంపై డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత ఎర్రవ్వకు మద్దతుగా డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఇత్వర్ పేట్ లింగన్న (ఆర్మూర్ మండల), ఏవైఎస్ అధ్యక్షులు పింజ సుదర్శన్,ఎమ్మార్పీఎస్ నాయకులు మార్క్, ఏ వై ఎస్ నాయకులు కళ్లెం భోజన్న తదితరులు గ్రామాన్ని సందర్శించి బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా లీడర్ లింగన్న మాట్లాడుతూ... ఒక దళిత మహిళకు ప్రభుత్వం కేటాయించిన భూమిని అక్రమార్కులు కబ్జా చేస్తుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన అక్రమార్కులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ సమస్యను జిల్లా మరియు రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని, పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.



## ఫీజుల పేరుతో దోపిడీని ఆపండి

### -గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

### -ఆర్ ఎల్ డి విద్యార్థి విభాగం డిమాండ్

### -పృథ్వి నాయక్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: జూలై 13: (ప్రజా కలం న్యూస్):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు గుగులోత్ పృథ్వి నాయక్ డిమాండ్ చేశారు.సోమవారం కలెక్టరేట్ లో జరిగిన గ్రీవెన్స్ లో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పృథ్వి నాయక్ మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యా హక్కు చట్ట ప్రకారం ఆర్టిఇ 2009 ప్రకారం ప్రతి ప్రైవేట్ స్కూల్ లో కనీస సౌకర్యాలు ఉండాలని, ఎల్ కె జీ నుండి ఎనిమిదోవ తరగతి వరకు 25% సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలని.చాలా స్కూళ్లు ఈ నిబంధనలు పాటించడం లేదన్నారు.ప్రభుత్వ ఫీజు కంటే అదనంగా డొనేషన్, డెవలప్మెంట్ ఫీజు వసూలు చేస్తున్నారని,అనుమతి లేకుండా నవోదయ,ఐఐటి, నీట్ కోచింగ్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు.ఈ అంశంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర కళ్యాణ్ నాయక్,వీరు నాయక్, వేణుగోపాల్,లకావత్ నాగేశ్వరరావు నాయక్, రమణ తదితరులు పాల్గొన్నారు.



## చిన్ననాటి మిత్రుడిని కలిసిన బండారు దత్తాత్రేయ

ఎల్బీనగర్, జులై 13 (ప్రజా కలం ప్రతినిధి)

హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం ఎల్బీనగర్‌లోని బ్యాంక్ కాలనీలో నివసిస్తున్న తన చిన్ననాటి మిత్రుడు జైహింద్‌ను ఆయన నివాసంలో కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ, చిన్ననాటి స్నేహితుడిని ఎన్నో రోజుల తర్వాత కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి చేరుకున్నా స్నేహబంధాలను మరచిపోకూడదని అన్నారు.జైహింద్ మాట్లాడుతూ, తన చిన్ననాటి స్నేహితుడు దత్తాత్రేయ ఎంతటి ఉన్నత పదవులు చేపట్టినా పాత స్నేహాన్ని గుర్తుంచుకుని తమ ఇంటికి రావడం తనకు, తన కుటుంబ సభ్యులకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు.దత్తాత్రేయ రాక విషయం తెలుసుకున్న స్థానిక బీజేపీ నాయకులు హరి ప్రసాద్, నవీన్, శ్రీధర్ తదితరులు అక్కడికి చేరుకుని ఆయనకు ఘనంగా సన్మానం చేశారు.





## రోడ్డు అక్రమణలను అడ్డుకోండి

### - జోనల్ కమిషనర్ కి సిపిఐ వినతిపత్రం అందజేత

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ జోనల్ పరిధి చింతల్ సర్కిల్, మహాదేవపురం, గాజులరామారం సర్కిళ్ల రోడ్డులను ఆక్రమించుకుంటూ నిర్మాణాలు సాగిస్తున్నారని దీంతో రాకపోకులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనాల్సి వస్తుందని, ఈవిషయాన్ని గతంలో కూడా అన్ని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆఫీసుల్లో వినతిపత్రం ఇచ్చినప్పటికీ చర్యలు తీసుకోలేదని వెంటనే రోడ్ల ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ని కోరారు. జగద్గిరిగుట్ట పరిధిలోని పైప్లైన్ రోడ్ సిపిఐ ఆఫీస్ లైన్, బీరప్ప నగర్ కొత్తగా వేసిన రోడ్డులపై నిర్మాణాలు జరుగుతున్నాయని గతంలో మున్సిపల్ సిబ్బంది తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడం మళ్లీ అవి ఇప్పుడు శాశ్వత నిర్మాణాలుగా మారే ప్రమాదం ఉంది. వెంటనే మరోసారి అలాంటి నిర్మాణాలు కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవిషయాలపై స్థానిక సిబ్బందికి తెలిసినప్పటికీ చర్యలు తీసుకోవట్లేదని, దీనిపై ప్రజల్లో అనేక అపోహాలు ఉన్నాయని స్థానిక సిబ్బంది వారికి సహకరిస్తున్నారని ప్రజలు భావిస్తున్నారని కాబట్టి ప్రభుత్వంపైన చెడ్డ పేరు రాకుండా ఎలాంటి పక్షపాతం లేకుండా విధులను సక్రమంగా నిర్వహిస్తే ప్రజలకు ఎలాంటి కష్టాలు ఉండవని జోనల్ కమిషనర్ కి చెప్పారు.

రావి నారాయణరెడ్డి నగర్ లో బాక్స్ నాలను నిర్మించే సమయంలో రోడ్డును తవ్వి వదిలేయడం వల్ల ప్రజలకు వెళ్లడానికి తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్య మండలి అధ్యక్షులు బాబు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు సదానంద్, సహదేవరెడ్డి, వెంకటేష్, కొండయ్య, శ్రీనివాస్, జంబవా మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## అటవీ వ్యవసాయ మొక్కల పెంపకం పద్ధతులపై శిక్షణ కార్యక్రమం.

బొమ్మలరామారం (ప్రజా కలం), జులై 13

జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో టీజేటీఏయు వ్యవసాయ శాఖ విశ్వవిద్యాలయం, అటవీ వ్యవసాయ విభాగం వారు మండలంలోని మైలారం కింది తండా గ్రామపంచాయతీ రైతులకు ట్రైబల్ సబ్ ప్లాన్ కింద గిరిజన రైతులకు 2 లక్షల 24 వేల రూపాయలతో కొబ్బరి, జామ, మామిడి, సీతాఫల్, మహా గాని వంటి అటవీ మొక్కలను మరియు టార్పాలిన్ లను 30 మంది రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా శాస్త్రవేత్త రామాంజనేయులు మాట్లాడుతూ మొక్కల పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి ఎన్. దుర్గేశ్వరి, ఏఈఓ ఆదిల్, పిఏసిఎస్ చైర్మన్ సింగిర్తి మల్లేష్, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వైస్ రాజేష్ పైలెట్, మైలారం కింది తండా సర్పంచ్ కోటేష్, పిఏసిఎస్ డైరెక్టర్ సిద్దంకి అండాలు,ఉప సర్పంచ్ రాజేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు





## సమావేశమైన ఎల్లారెడ్డి సొసైటీ పాలకవర్గం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 13 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గ సాధారణ సమావేశం సోమవారం జరిగినట్లు అధ్యక్షులు ఏగుల నర్సింలు తెలిపారు. ఈ సమావేశంలో మే, జూన్ నెలలకు సంబంధించిన ఆదాయ వ్యయాలను కార్యదర్శి విశ్వనాథం పాలకవర్గ సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం పంట రుణమాఫీ, స్వల్పకాలిక అప్పులు ఇప్పించుట, సంఘ పరిధిలో లక్ష్మాపూర్ గ్రామం వద్ద నూతన భవనం నిర్మించుటకు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సూర్యప్రకాశ్, బాలరాజు, లక్ష్మణ్, సుఖేందర్ రెడ్డి, సత్యవ్వ, నారాయణ, నర్సింలు, సొసైటీ సిబ్బంది మల్లేష్, సత్యనారాయణ, సాయిబాబు, ప్రభుదాస్, కృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 13 ప్రజా కలం : ఎల్లారెడ్డి పట్టణంలో సోమవారం ఎన్డిడి ప్రోగ్రాం లో భాగంగా ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసున్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు మతమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శరత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11,385 మంది విద్యార్థులు తమకు టార్గెట్ కాగా సోమవారం 10,232 మంది బడి పిల్లలతో పాటు బడిపేట వారికి కూడా నులి పురుగుల నివారణ మాత్రలు వేసినట్లు ఆయన తెలిపారు. మిగతా వారికి ఈనెల 20వ తేదీన వేస్తామన్నారు. ఒకటి నుండి 19 సంవత్సరాల పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు అంగన్వాడీ స్కూల్స్, పాఠశాలలు, కళాశాలలో ఇవ్వడం జరుగుతుంద న్నారు. సంవత్సరంలోపు పిల్లలకు టాబ్లెట్లు వేయకూడదని, ఒకటి నుండి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను వేయాలని, రెండు నుండి ఐదు సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర క్రష్ చేసి ఇవ్వాలని, ఐదు నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర ఇవ్వాలన్నారు. ఆల్బెండజోల్ మాత్ర 400 ఎంజి డోస్ ఉంటుందని, దీనికి ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని ఆయన స్పష్టం చేశారు.



# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం విజయవంతం

### -1--19 ఏళ్ల పిల్లలకు ఉచితంగా ఆల్బెండాజోల్ మాత్రలు
### - తల్లిదండ్రులు సహకరించాలని వైద్య శాఖ పిలుపు

హైదరాబాద్, జూలై 13 (ప్రజా కలం ప్రతినిధి)

పిల్లల్లో నులిపురుగుల సమస్యను నివారించి, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదల, పోషకాహార లోపాల నివారణ, విద్యా పురోగతిని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (చీఫ్అశీఋశ్రీ ఐవఽశీతీఎఅఅస్త్ర ఋఎ) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

ఈ కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, యువతకు ఆల్బెండాజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలు, ఇతర విద్యాసంస్థలు, అవసరమైన ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాల ద్వారా మాత్రలు అందజేయనున్నారు. పాఠశాలకు వెళ్లని పిల్లలకు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి మాత్రలు అందజేస్తారు.

నులిపురుగుల వల్ల కలిగే నష్టాలు

పేగుల్లో నివసించే నులిపురుగులు కలుషితమైన నీరు, అపరిశుభ్రమైన ఆహారం, చేతులు కడుక్కోకుండా భోజనం చేయడం, బహిరంగ మలవిసర్జన వంటి కారణాల వల్ల శరీరంలోకి ప్రవేశిస్తాయి. వీటి కారణంగా రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం, జ్ఞాపకశక్తి తగ్గడం, చదువుపై ఏకాగ్రత లోపించడం, అలసట, బలహీనత, కడుపు నొప్పి, ఆకలి తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

మాత్ర మోతాదు ఇలా

1--2 సంవత్సరాల పిల్లలకు 200 మి.గ్రా. (400 మి.గ్రా. మాత్రలో సగం) చూర్ణం చేసి ఇవ్వాలి.

2--19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, యువతకు 400 మి.గ్రా. పూర్తి మాత్రను చూర్ణం చేసి ఇవ్వాలి. భోజనం చేసిన తర్వాత మాత్ర ఇవ్వడం మంచిదని, చిన్నపిల్లలకు చూర్ణం చేసి ఇవ్వాలని అధికారులు తెలిపారు.

ఎవరికి ఇవ్వకూడదు

ఒక సంవత్సరం లోపు శిశువులకు ఆల్బెండాజోల్ మాత్ర ఇవ్వకూడదని, తీవ్ర అనారోగ్యంతో ఉన్న పిల్లలకు కోలుకున్న తర్వాత మాత్రమే ఇవ్వాలని సూచించారు. వైద్యుల ప్రత్యేక సూచనలు ఉంటే వాటిని తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం, మరుగుదొడ్లను మాత్రమే ఉపయోగించడం, పరిశుభ్రమైన తాగునీటిని వినియోగించడం, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి తినడం, గోర్లు చిన్నగా ఉంచుకోవడం, ఎల్లప్పుడూ చెప్పులు ధరించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం



ద్వారా నులిపురుగుల బారిన పడకుండా నివారించవచ్చని అధికారులు తెలిపారు.

ప్రజలకు విజ్ఞప్తి

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంరక్షకులు తమ పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రను తప్పనిసరిగా వేయించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని వైద్య ఆరోగ్య శాఖ పిలుపునిచ్చింది.

"నులిపురుగులకు చెక్ -- ఆరోగ్యవంతమైన బాల్యానికి బాట."



# 'వరుణుడి అలకతో రైతన్న విలవిల'

- వానలు లేక అల్లాడుతున్న రైతన్నలు
- వర్షాల కోసం ఆశగా ఆకాశం వంక చూస్తున్న వైనం
- నీరు లేక వెలవెలబోతున్న చెరువులు, కుంటలు
- సాగు విస్తీర్ణం భారీగా తగ్గే అవకాశం
- గాలులకు ఎండుతున్న వరి నారు మడులు
- ప్రారంభమైన 'ఎల్ నినో ప్రభావం'
- కరువు దిశగా తెలంగాణ పయనం...
- మెజారిటీ జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదు
- క్రమంగా పెరుగు తున్న పగటిపూట ఉష్ణోగ్రతలు





కామారెడ్డి జిల్లా ప్రతినిధి
జూలై 13 ప్రజా కలం :

వరుణుడు రైతన్న పై అలక వహించడంతో రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించక వర్షాలు కురవడం లేదు. దీంతో వ్యవసాయ పనులు ముందుకు సాగక పోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో కరువు ఛాయలు వేగంగా అలుముకుంటున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రజలు వరి నాట్లు ఇతర వర్షాధార పంటలు వేయడంలో నిమగ్నమయ్యారు. కానీ వ్యవసాయ అవసరాల కోసం సరిపడా వర్షాలు కోరిక పోవడంతో వేసిన పంటలు సైతం ఎండిపోతున్నాయి. జూలై నెలాఖరు వరకు కూడా ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ అభిప్రాయపడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా సరైన వర్షాలు లేక పంటల సాగు పనులు సగానికి సగం పైగా నిలిచిపోయాయి. తెలంగాణ నీటిపారుదల శాఖ నివేదికల ప్రకారం జూన్-జూలై నెలల్లో సగటున 22 శాతం వరకు వర్షపాతం లోటు ఏర్పడగా కొన్ని ప్రాంతాల్లో ఇది 42 శాతానికి పైగా ఉంది. దీంతో ఖరీఫ్ పంటల సాగు 22 శాతం వరకు పడినట్లు ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే తొలకరి వర్షాలకు వేసిన మొక్కజొన్న, సోయా, పత్తి వంటి పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రానున్న రెండు మూడు వారాలపాటు అక్కడక్కడ చిరుజల్లులు మాత్రమే కురుస్తాయని భారీ వర్షాలు ఉండవని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో వ్యవసాయం మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని 20 జిల్లాల్లో తీవ్ర వర్షపాతం లోటు ఉండగా ఇది మరిన్ని జిల్లాలకు పాకే అవకాశం ఉందని అంచనా.

**సంక్షోభం ముంగిట ఖరీఫ్ సాగు....**

గత నెల, ప్రస్తుత జూలైలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురువక పోవడంతో పోసిన వరి నారుమళ్ళతో పాటు మొక్కజొన్న, పత్తి, సోయా వంటి పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. నేలలో తగినంత తేమ లేకపోవడం వల్ల పప్పు ధాన్యాలతో పాటు ఇతర పంటలు ఎండిపోయే ఆస్కారం ఉంది. వర్షాల తగ్గుదల వల్ల జల విద్యుత్ ఉత్పత్తి కూడా 10 శాతం నుండి 15% వరకు తగ్గే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**ప్రారంభమైన ఎల్ నినో ప్రభావం....**

అసలు ఎల్ నినో అంటే ఏమిటో తెలుసుకుందాం. పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగటాన్ని ఎలినినో అంటారు. సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రత సహజంగా 3.4 డిగ్రీలు గా ఉంటుంది. ఇప్పుడు అది 0.5 శాతం పెరిగింది. అంటే సముద్రపు నీరు ఉండాల్సిన వేడి కంటే అధిక వేడిగా ఉంది. దీనినే ఎల్ నినో అంటారు. ఇది జూన్ నుంచి ఆగస్టు మధ్యకాలంలో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. జూలై మధ్య నుంచి తూర్పు పసిఫిక్ అంతట విస్తరిస్తుందని ఇదంతా రుతుపవనాలు కాలంలోనే జరుగుతుందని స్పష్టం చేసింది వాతావరణ శాఖ.

**ఎల్ నినో ప్రభావం ఎలా ఉంటుంది...**

సహజంగా నైరుతి రుతుపవనాల సీజన్లో చల్లటి వాతావరణంతో పాటు నికరంగా వర్షాలు పడతాయి. ఎల్ నినో ప్రభావంతో సముద్రం నీరు వేడెక్కటం వల్ల సముద్రం నుంచి భూమిపైకి వేడిగాలులు వీస్తాయి. భూమిపై ఎక్కువగా పొడి వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షపాతం తక్కువగా ఉంటుంది. దీంతో కరువు పరిస్థితులు తలెత్తుతాయి. దీనికి తోడు అక్కడక్కడ కుండపోత వర్షాలు, క్లౌడ్ బరస్టులు ఉంటాయి. దీని వల్ల విపత్తులు వచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు తక్కువగా పడటం వల్ల సాగు, తాగు నీటి కొరత ఏర్పడుతుంది.

**వానల కోసం ఆకాశం వంక ఆశగా చూస్తున్న రైతన్న...**

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్న ఇప్పటికీ ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో రైతులు వర్షాల కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. వర్షాలు కురిస్తే సాగు పనులు జ్వరంతో పోవడంతో తమకు చేతినిండా పనుండడంతోపాటు సమృద్ధిగా పంటలు పండుతాయని వారు ఆశిస్తున్నారు. కాని వారి ఆశలపై ఎల్ నినో నీళ్లు చల్లేలా ఉంది. ఇప్పటికే పంటల సాగుకు అవసరమైన మేర వర్షాలు పడకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సాగు పనులు దాదాపుగా ఆగిపోయాయి. మరో రెండు మూడు వారాలపాటు ఇలాగే వర్షాలు కురవకపోతే పూర్తిస్థాయి కరువు దిశగా తెలంగాణ రాష్ట్రం పయనిస్తుంది. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బ తినడంతో పాటు రైతులు, రైతు కూలీలకు దుర్భర పరిస్థితులు తప్పవు. ఈ పరిస్థితుల్లో దేవుడు కరుణించి వర్షాలు కురిపించాలని ప్రజలు ముఖ్యంగా రైతన్నలు కోరుకుంటున్నారు.

**నీరు లేక వెలవెలబోతున్న చెరువులు, కుంటలు...**

సాధారణంగా జూన్ జూలై ఆగస్టు నెలల్లోనే భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు కొత్తనీటితో కళకళలాడుతుంటాయి. కానీ ప్రస్తుతం మాత్రం ఇందుకు విరుద్ధంగా సరైన వర్షాలు కురువక చెరువులు, కుంటల్లో నీరు లేక వెలవెలబోతున్నాయి. నీటితో కలకలలాడాల్సిన చెరువులు, కుంటలు చెట్లు ముళ్ళపొదలతో నీరు లేక కళావిహీనంగా కనిపిస్తున్నాయి. చెరువులు నిండకపోవడంతో బోరు బావుల్లో నీరు తగ్గి వ్యవసాయ పనులు ముందుకు సాగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**క్రమంగా పెరుగుతున్న పగటి పూట ఉష్ణోగ్రతలు...**

వాస్తవానికి జూన్, జూలై, ఆగస్టు నెలలో నిరంతరం వర్షాలు, తొలకరి జల్లులు కురుస్తూ చల్లటి వాతావరణం ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఇందుకు పూర్తి భిన్నంగా వేసవిని తలపిస్తూ ఉక్కపోత, ఎండలు కాస్తున్నాయి. దీంతో అటు వ్యవసాయ పనులు ముందుకు సాగకపోవడంతో పాటు ఇటు ఎండ వేడిమి, ఉక్కపోతతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా వరుణుడు కరుణించి వర్షాలు కురిస్తే చాలని రైతులు, ప్రజలు కోరుకుంటున్నారు.





# అమీన్‌పూర్‌లో అక్రమ కట్టడాల దందా?

**- కృష్ణారెడ్డిపేట సూర్య రెసిడెన్సీపై తీవ్ర ఆరోపణలు**

**అనుమతి ఒకటి.. నిర్మాణం మరొకటంటూ స్థానికుల ఆవేదన**




**అమీన్‌పూర్, జులై 13 (ప్రజా కలం ప్రతినిధి)**

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కృష్ణారెడ్డిపేటలో నిర్మాణంలో ఉన్న సూర్య రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌పై స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణానికి పొందిన అనుమతులకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, జీ+3 నిర్మాణానికి అనుమతి పొందినప్పటికీ, అనుమతులకు భిన్నంగా నిర్మాణం చేపడుతున్నారని చెబుతున్నారు. అంతేకాకుండా, సెట్‌బ్యాక్ నిబంధనలను ఉల్లంఘించడంతో పాటు పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో గదులు నిర్మించారని ఆరోపిస్తున్నారు. మరికొందరు ఇతరుల స్థలాన్ని కూడా ఆక్రమించి నిర్మాణం చేపట్టినట్లు పేర్కొంటున్నారు. ఈ అక్రమాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు పంచాయతీ అధికారుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆరోపణలు చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల నుంచి అధికారిక స్పందన వెలువడలేదు. అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో కృష్ణారెడ్డిపేటలోని ఈ నిర్మాణంపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. వాస్తవాలు వెలుగులోకి తీసుకువచ్చి, నిబంధనల ఉల్లంఘన జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రేడియల్ రోడ్డుపై రెచ్చిపోయిన అక్రమాలు

**-రేడియల్ రోడ్డుకు అక్రమ నిర్మాణాల ముప్పు..**

**-కమిషనర్ సృజనకు వినతిపత్రం..**

**-ఐలాపూర్ తండాలో నిర్మాణాలపై ఆందోళన..**

**-మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్..**



పటాన్ చెరు, జులై 13 (ప్రజా కలం) ప్రతినిధి

లింగంపల్లి,అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్ బయటి వలయ రహదారి మార్గంలో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని, మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన రేడియల్ నంబర్ 31 రహదారి పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నేతలు, కాలనీ సంఘాల ప్రతినిధులు నివాసితులు సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనకు వినతిపత్రం సమర్పించారు ప్రస్తుతం బీరంగూడ కమాన్ నుంచి కృష్ణారెడ్డిపేటమీదుగా సుల్తాన్‌పూర్ బయటి వలయ రహదారి ఎగ్జిట్‌కు చేరుకునే మార్గంలో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని, రోజురోజుకూ వాహనాల రద్దీ పెరిగిపోతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తుమ్మల పాండురంగారెడ్డి వివరించారు. లింగంపల్లి నుంచి బంధంకొమ్ము, అమీన్‌పూర్, ఐలాపూర్ తండా మీదుగా సుల్తాన్‌పూర్ బయటి వలయ రహదారికి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేస్తే వేలాది మంది ప్రయాణికులకు సమయం, ఇంధనం ఆదా అవుతాయని తెలిపారు.

**ఐలాపూర్ తండాలో అక్రమ నిర్మాణాలపై ఆందోళన..**

లింగంపల్లి నుంచి అమీన్‌పూర్ వరకు 150 అడుగుల రహదారి అభివృద్ధి పనుల కోసం ప్రజాప్రతినిధులు, మంత్రుల సహకారంతో రూ.45 కోట్ల నిధులతో పనులు ప్రారంభించిన విషయాన్ని నేతలు గుర్తుచేశారు. అయితే రేడియల్ నంబర్ 31లో ప్రతిపాదించిన 100 అడుగుల రహదారి పరిధిలోని ఐలాపూర్ తండా వద్ద రహదారికి ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ప్రభుత్వ, చెరువు భూముల రక్షణ కోసం హైడ్రా అధికారులు ఏర్పాటు చేసిన కంచెను దాటి కొంతమంది నిర్మాణదారులు పనులు కొనసాగిస్తున్నారని వారు ఆరోపించారు. అమీన్‌పూర్ చౌరస్తా నుంచి పీఎన్‌ఆర్ కాలనీ మీదుగా ఐలాపూర్ తండా ద్వారా సుల్తాన్‌పూర్ రింగ్ రోడ్డును కలిపితే కేవలం ఐదు నిమిషాల్లో బయటి వలయ రహదారికి చేరుకునే అవకాశం ఉంటుందని, ప్రస్తుతం జరుగుతున్న అక్రమ నిర్మాణాలు కొనసాగితే భవిష్యత్తులో రవాణా వ్యవస్థకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**తక్షణ చర్యలు తీసుకోవాలి..**

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఐలాపూర్ తండాలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, మాస్టర్ ప్లాన్ ప్రకారం రేడియల్ నంబర్ 31 రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని కమిషనర్ సృజనను కోరారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పలువురు నేతలు, కాలనీ సంఘాల ప్రతినిధులు, స్థానిక నివాసితులు పాల్గొన్నారు..

# 27 కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మల్కాజిగిరి,జూలై 13 (ప్రజా కలం ప్రతినిధి)

27 కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ దాదాపు 18 లక్షల రూపాయల చెక్కులను బాధితుల బంధువులకు కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్చార్జి లక్ష్మీకాంతరెడ్డి



నియోజకవర్గ నాయకులతో కలసి ఆనంద్ బాగ్ మైనంపల్లి క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఉన్న వారికి ఒక అభయ హస్తం లాంటిదని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో బాధితుల కుటుంబాలకు చెక్కులను అందజేసినట్లు చెప్పారు. అర్హులు సీఎం సహాయ నిధిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్,బీకే శ్రీనివాస్ గుండా నిరంజన్,జివన్వి సతీష్ కుమార్,వినోద్ యాదవ్,రాందాస్ సంతోష్ ముదిరాజ్,పార్థసారథి, నరేష్,పాండు రంగ చారి,రామకృష్ణ,గ్యార ప్రవీణ్,షకీల్, తదితరులు పాల్గొన్నారు

# ఎలాంటి అనుమతులు లేకుండా రెసొనెన్స్ కళాశాల నిర్వహణ

**- బోర్డు పేరు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా రెసొనెన్స్ కళాశాల నిర్వహణ**

**- తల్లిదండ్రులకు కుచ్చుటోపీ పెడుతున్న రెసొనెన్స్ యాజమాన్యం**

**- ఇంత జరుగుతున్న అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం - చరవాణీకి స్పందించని డిఐఈవో**

**- జిల్లా కలెక్టర్ స్పందించాలంటున్న విద్యార్థి సంఘాలు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన**



రాజేంద్రనగర్ జూలై 13(ప్రజా కలం)

ఎలాంటి అనుమతులు లేకుండా రెసొనెన్స్ కళాశాల నిర్వహణ పట్ల విద్యార్థి తల్లిదండ్రుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి జోన్ అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని డైరీ ఫార్మ్ వద్ద ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా రెసొనెన్స్ జూనియర్ కళాశాలను నిర్వహిస్తూ తల్లిదండ్రుల విద్యార్థులకు కుచ్చుటోపి పెడుతున్న యాజమాన్యం. ఈ కళాశాలకు బిల్డింగ్ అనుమతులే కాదు కదా విద్యాశాఖ ఇంటర్ బోర్డ్ నుండి కూడా ఎలాంటి సరైన అనుమతులు లేకుండానే లక్షల్లో ఫీజులు దండుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలోనే పాఠ్యపుస్తకలను విక్రయిస్తూన్నారు. ఈ కళాశాలపై విద్యార్థి సంఘాలు పలుమార్లు విద్యాశాఖకు ఫిర్యాదు చేసిన పలు పత్రికల్లో కథనాలు వచ్చిన అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనకడుగు




వేస్తున్నారు. జిల్లా డిఐఇఓ కు ఫిర్యాదు చేసేందుకు చేరవాణిలో సంప్రదించగా ఫోన్ ఎత్తి సమాధానం చెప్పిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. రెసొనెన్స్ కళాశాల యాజమాన్యంతో డిఐఈఓ కుమ్మక్కు అయి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ లక్షల్లో ఫీజులు దోచుకుంటూన్నారని బహిరంగ ఆరోపణలు చేస్తున్నారు. ఫిర్యాదులకు స్పందించకుండా చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తూ యాజమాన్యానికి సహకరిస్తూ విద్యార్థుల జీవితాల్లో చెలగాటమాడుతున్న డిఐఈఓపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు సైతం డిమాండ్ చేస్తున్నారు.

# రోడ్లు.. చెత్తపై గళమెత్తిన సింధు..

## భారతి నగర్‌లో పారిశుద్ధ్యంపై మాజీ కార్పొరేటర్ ఆగ్రహం..

పటాన్‌చెరు, జూలై 13 (ప్రజా కలం)ప్రతినిధి

భారతి నగర్ డివిజన్‌లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలతో పాటు పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనను కోరారు. సోమవారం కమిషనర్ కార్యాలయంలో సృజనను కలిసి డివిజన్‌కు సంబంధించిన పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. బీహెచ్‌ఈఎల్ హాల్ట్ ఎంఎంటీఎస్ స్టేషన్ నుంచి విద్యుత్‌నగర్ వరకు ప్రతిపాదించిన తారు రహదారి పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ సంతృప్తికరంగా లేదని, పార్కులు, ఖాళీ స్థలాలు, పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి పరిశుభ్రతను మెరుగుపర్చాలని కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సింధు ఆదర్శ్ రెడ్డి కోరారు..




# జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం..

**-టీయూడబ్ల్యూజే జిల్లా నూతన కమిటీకి ఘన సన్మానం..**



పటాన్‌చెరు, జులై 13 (ప్రజా కలం) ప్రతినిధి

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా నూతన కమిటీలో ఎన్నికైన పటాన్‌చెరు నియోజకవర్గ జర్నలిస్టులకు సోమవారం పటాన్‌చెరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టులు రామారావు,ఆశ్వక్, రమేష్,రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, మాజీ అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్దుల్ బాసిత్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్,ఉపాధ్యక్షుడు పర్చ శ్రీనాథ్,సంయుక్త కార్యదర్శులు కే శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, కార్యవర్గ సభ్యులు సయ్యద్ మజీద్ అలీ, మైకోటి శ్రీనివాస్‌లను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా బండారు యాదగిరి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, అక్రిడిటేషన్‌లు, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య కార్డుల అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. త్వరలో వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. నూతన కమిటీ సభ్యులు జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తామని,సంగారెడ్డి జిల్లా కమిటీని రాష్ట్రంలోనే ఆదర్శ కమిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్ బసవేశ్వర్ బాసిత్ శ్రీనివాస్ రెడ్డి భూపాల్ రెడ్డి మజీద్ శ్రీనివాస్ రామారావు అశ్వక్ రాజశేఖర్ రమేష్ నరసింహ రత్నం శివ భూమయ్య నరసింహ చారి యాదగిరి నాగేష్ వివేక్ శేఖర్ సలీం పురుషోత్తం రాజు శ్రీకాంత్ సంతోష్ విట్టల్ బాలు కాశీపతి బాచిరెడ్డి శంకర్ శ్రీనివాస్ కోటేష్ సిద్దు రాజు శ్రీనివాస్ రెడ్డి లక్ష్మీ నాయుడు ప్రభాకర్ హరీష్ టీయూ డబ్ల్యూజే నాయకులు, సభ్యులు, స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు..



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

# జిల్లాలో 2.12 లక్షల మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు..

## నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తీసుకోవాలి: కలెక్టర్ కె.హైమావతి



గజ్వేల్ నియోజకవర్గం:13 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలం దుద్దేడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లల సంపూర్ణ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రతి ఏడాది జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు.

నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, వాటి నివారణకు ప్రతి అర్హత కలిగిన చిన్నారి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల 2,12,536 మంది పిల్లలకు మొత్తం 2,461 పంపిణీ కేంద్రాల ద్వారా ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. జూలై 13న మాత్రలు తీసుకోలేని పిల్లలకు జూలై 20న నిర్వహించే మాప్-అప్ డేలో తప్పనిసరిగా మాత్రలు అందజేస్తామని పేర్కొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్యానికి మూలమని పేర్కొన్న కలెక్టర్, భోజనం ముందు మరియు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వారానికి ఒకసారి గోర్లు కత్తిరించుకోవడం, వేడి చేసి చల్లార్చిన నీటిని తాగడం, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి తినడం, ఆహారాన్ని మూతపెట్టి ఉంచడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అలవాట్లు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మంచి ఆరోగ్యం ఉన్నప్పుడే పిల్లలు చదువులోనూ, క్రీడల్లోనూ రాణిస్తారని పేర్కొంటూ "ఆరోగ్యకరమైన శరీరంలో ఆరోగ్యకరమైన మనస్సు" అనే సూక్తిని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని సూచించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. సి. హెచ్. ధనరాజ్ మాట్లాడుతూ, జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు.

అర్హులైన పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందించేందుకు ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని, మిగిలిన వారికి జూలై 20న జరిగే మాప్-అప్ కార్యక్రమంలో మాత్రలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.దీప్తి ప్రియాంక, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.శ్రీనివాస్, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, వైద్యాధికారి డా.శ్రీధర్, డీఈఎంఓ నవీన్ రాజ్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఆర్‌బీఎస్‌కే వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్

గజ్వేల్ నియోజకవర్గం:13 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన షేక్ యూనస్ అహ్మద్ అలీని సోమవారం బీఆర్ఎస్



బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐకి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో విజయవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాములపర్తి బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు పిట్ల మహేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొగ్గుల సురేష్ ని సన్మానించిన బిజెపి ఎండోమెంట్ సెల్ సిద్దిపేట జిల్లా కన్వీనర్ కాశమైన సందీప్ కుమార్-

గజ్వేల్:13 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్--ప్రజ్ఞాపూర్‌లోని ప్రసిద్ధ అయ్యప్ప దేవాలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బొగ్గుల సురేష్‌ను బీజేపీ ఎండోమెంట్ సెల్ సిద్దిపేట జిల్లా కన్వీనర్ కాశమైన సందీప్ కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి



శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ మాట్లాడుతూ, బొగ్గుల సురేష్ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలతో పాటు గోసేవలోనూ విశేష సేవలు అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. అయ్యప్ప దేవాలయ అభివృద్ధితో పాటు భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా ఆయన నాయకత్వం ఫలప్రదంగా ఉండాలని ఆకాంక్షించారు. అదే సేవా స్ఫూర్తితో సామాజిక, ధార్మిక కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. బొగ్గుల సురేష్ మాట్లాడుతూ, దేవాలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ ప్రముఖులు, భక్తులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ బీఎంఎస్ ఇంచార్జ్ మరాఠి కృష్ణమూర్తికి ఘన సన్మానం

గజ్వేల్:13 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) గజ్వేల్ ఇంచార్జ్ మరాఠి కృష్ణమూర్తిని సోమవారం మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాడిపల్లి భాస్కర్ మాట్లాడుతూ, కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. మరాఠి కృష్ణమూర్తి కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మరాఠి కృష్ణమూర్తి మాట్లాడుతూ, తనపై చూపిన అభిమానానికి గాడిపల్లి భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం మరింత బాధ్యతతో పనిచేస్తూ బీఎంఎస్ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.



## 17వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం



గజ్వేల్:13 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి) జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కల్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగ్‌రావు సోమవారం 17వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ వయస్సు, ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్నట్లు చెప్పారు. మట్టి ద్వారా సంక్రమించే నులిపురుగులు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, వాటి వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి తగ్గడం, బరువు పెరగకపోవడం, కడుపు నొప్పి, మలద్వారం వద్ద దురద వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. వైద్యుల సూచనల మేరకు అల్పాహారం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగుల సమస్యను నివారించి పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తోడ్పడవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రజారోగ్య కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు హీరణ్మయి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రవాడ బాలకృష్ణ, తాళ్ల నాగరాజు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నూతన పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించిన 'దేవసాని బలగం-కుటుంబ పరివార్'

### చేనేత కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

### : చేనేత సహకార సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం



గజ్వేల్:13 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చేనేత పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గ సభ్యులను 'దేవసాని బలగం--కుటుంబ పరివార్' (అక్కారం--గజ్వేల్) ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. పాలకవర్గ సభ్యులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి మిఠాయిలు పంచి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చేనేత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు స్వర్గం రాజేశం మాట్లాడుతూ, గత 14 సంవత్సరాలుగా చేనేత సహకార సంఘానికి ఎన్నికలు జరగకపోవడంతో సంఘం అభివృద్ధి దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో సమిష్టి నిర్ణయాలతో చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్న భరోసా, నేతన్న మిత్ర, నేతన్న పింఛన్, నేతన్న పొదుపు పథకాలతో పాటు రూ.5 లక్షల ప్రమాద బీమా, ముడిసరుకులు, నూలు, రసాయనాలపై సబ్సిడీలు అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి అందేలా కృషి చేస్తామని చెప్పారు. కార్పొరేట్ కంపెనీల విస్తరణతో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పద్మశాలి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అలాగే సంఘంలో సభ్యత్వాలను విస్తరించి చేనేత రంగాన్ని పూర్వ వైభవానికి తీసుకురావడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని మాట్లాడుతూ, అక్కారం--గజ్వేల్ ప్రాంతాల్లో దేవసాని బలగం--కుటుంబ పరివార్‌కు చెందిన 27 కుటుంబాలు ఉండగా, గజ్వేల్--ప్రజ్ఞాపూర్ పద్మశాలి సేవా సంఘంలో 126 మంది ఓటు హక్కు కలిగిన సభ్యులు ఉన్నారని తెలిపారు. చేనేత సహకార సంఘంలో కూడా దేవసాని కుటుంబ సభ్యులకు "ఇంటికి ఒకరు" చొప్పున సభ్యత్వం కల్పించాలని పాలకవర్గాన్ని కోరారు. రాబోయే పద్మశాలి సంఘం ఎన్నికల్లోనూ దేవసాని బలగం సభ్యులంతా సమిష్టిగా పనిచేసి విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు పూల సత్యం, ప్రధాన కార్యదర్శి ఎనగందుల రామచంద్రం, డైరెక్టర్లు దొంతుల ప్రసాద్, భాగ్యలక్ష్మి, పద్మశాలి కుల పెద్దలు ఆడెపు బాలచంద్రం, సిలువేరు బలరాం, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు నేత, దేవసాని నాగభూషణం, దేవసాని వాసుదేవ్, పోశెట్టి, దేవసాని భాస్కర్, దయానంద్, సత్యానంద్, దేవసాని హనుమాన్ దాస్, సుధాకర్, శ్రీనివాస్, రాజారాం, ఓం ప్రకాష్, వేణు, రవి, రాజేందర్, బాలరాజు, ప్రసాద్, నవీన్, పద్మశాలి కుల పెద్దలు, దేవసాని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మంజీర పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

గజ్వేల్:13 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని మంజీర పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (ఎన్‌డీడీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గజ్వేల్ ఏరియా అసిస్టెంట్ మేనేజర్ (ఏఏఎం), శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యుల సమక్షంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని, వాటి నివారణకు ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రను తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, గోర్లను క్రమం తప్పకుండా కత్తిరించుకోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, సురక్షితమైన తాగునీటిని వినియోగించడం వంటి అలవాట్లను ప్రతి విద్యార్థి అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, జులై 13,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం నాదర్గుల్ డివిజన్ లోని అల్మాస్‌గూడలో వార్డు కార్యాలయం ప్రభుత్వ



పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) కార్యక్రమంలో ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన, అర్హులైన ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోవడం, అవసరమైన సవరణలు చేయించుకోవడం, అనర్హత మరియు దొంగ ఓట్లను తొలగించే ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. అదేవిధంగా, అక్కడికి వచ్చిన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను (ఏనుమేరేషన్ ఫార్మ్స్ ) అందజేసి, వాటిని సరైన వివరాలతో పూర్తిగా నింపి సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు. ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షించబడేలా, ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా ప్రతి ఒక్కరూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## శ్రీ శివగంగ రాజరాజేశ్వరి ఆలయ అభివృద్ధికి ఐదు లక్షల విరాళం

### శ్రీ శివగంగ రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆవేర్ హాస్పిటల్ పీకేఎస్ మాధవన్ జి

మహేశ్వరం, జులై 13, (ప్రజా కలం)

ఆరుద్ర నక్షత్రం మాస శివరాత్రి సందర్భంగా శ్రీ శివగంగ రాజరాజేశ్వరి రాజరాజేశ్వర స్వామి ని ఆవేర్ హాస్పిటల్ పీకేఎస్ మాధవన్ జి వారి అనుచరులు వెంకటరెడ్డి డైరెక్టర్ పి తరుణ్ ఎండి నాగేశ్వరరావు లాయర్ వెంకన్న ఇంచార్జ్ బీఈడీ కాలేజ్ ప్రిన్సిపాల్ అనంతరావు లెక్చరర్ మైపాల్ సెక్రెటరీ నందిని పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న తర్వాత మాధవన్ జి ఆలయ అభివృద్ధికై తనవంతుగా ఐదు లక్షల రూపాయలు ఇవ్వడానికి పూనుకున్నారు అందుకుగాను వారి పైన శివయ్య ఆశీస్సులు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ మరి ఇలాంటి సేవలు ఇంకెన్నో అందించాలని మనస్ఫూర్తిగా దేవాలయ ధర్మాదాయ దేవస్థానం మహేశ్వరం శివగంగ టెంపుల్ చైర్మన్ అల్లే కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దేవేందర్ చందు తదితరులు పాల్గొన్నారు.

